# పెన్ పవర్

12 YEARS PEN POWER JOURNEY 2014 - 2026 ప్రశ్నించడం మన హక్కు

విశాఖపట్నం | హైదరాబాద్ | ఉభయ గోదావరి | ఎన్. టి. ఆర్ | గుంటూరు | ప్రకాశం | నెల్లూరు | తిరుపతి | చిత్తూరు | కడప

తెలుగు దిన పత్రిక PEN POWER TELUGU DAILY ప్రశ్నించడం మన హక్కు

సంపుటి : 13 సంచిక : 27 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : విశాఖపట్నం ఆదివారం 27 సెప్టెంబర్ 2026 వెల : 1/-రూ ॥

VOLUME :13 ISSUE :27 PAGES :8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : VISAKHAPATNAM SUN 27 SEPTEMBER 2026 PRICE : 1/- RS

Simultaneously Published form Visakhapatnam,Kakinada,Bapatla,NarasaraoPeta,Ongole,YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur




## 10 శాతం వృద్ధి సాధ్యమే

### టెక్నాలజీపై నిర్మలా సీతారామన్ కీలక వ్యాఖ్యలు

- ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌లో పెట్టుబడులతోనే దేశానికి ఉజ్వల భవిష్యత్తు
- ఏఐ, సెమీకండక్టర్లకు భారీగా నిధులు కేటాయించాలని సూచన
- చిన్న పరిశ్రమల్లోనూ ఏఐ వాడకం పెరగాలని వ్యాఖ్య

- మిగతా 2లో

## పాకిస్థాన్‌లో ఆత్మాహుతి దాడి.. 11 మంది మృతి



- పాకిస్థాన్‌లో పోలీసు చెక్‌పోస్ట్‌పై ఆత్మాహుతి దాడి
- ఈ ఘటనలో 11 మంది మృతి, 30 మందికి గాయాలు
- పలువురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు వెల్లడి
- దాడికి బాధ్యత ప్రకటించుకున్న తెహ్రీక్-ఇ-తాలిబన్

- మిగతా 2లో



## కర్నూలులో ఏవియేషన్ అకాడమీ రావడం చరిత్రాత్మకం

- ఏవియేషన్ సెంటర్ ను ప్రారంభించిన ఓరియంట్ ఫ్లైట్స్ ఏవియేషన్ అకాడమీ
- పైలట్లకు డిమాండ్ విపరీతంగా పెరుగుతుందన్న మంత్రి
- ఓర్వకల్లులో డ్రోన్ సిటీ ఏర్పాటు చేయబోతున్నట్టు బీసీ జనార్దన్ ప్రకటన

- మిగతా 2లో



## సీఎం విజయ్ నటనను ఇంకా ఆపలేదు: స్టాలిన్

- సీఎం విజయ్‌పై మాజీ సీఎం స్టాలిన్ తీవ్ర విమర్శలు
- ప్రజల ముందు విజయ్ నటన ఇంకా కొనసాగుతోందని ఎద్దేవా
- డీఎంకే పథకాలకే పేర్లు మార్చి అమలు చేస్తున్నారని ఆరోపణ
- సీఎం పదవికి తగిన హుందాతనం చూపాలని హితవు

- మిగతా 2లో

# భారీ వర్షాలతో ఉత్తరాంధ్ర అతలాకుతలం..

## అధికారులకు చంద్రబాబు కీలక ఆదేశాలు

- భారీ వర్షాలు, వరద పరిస్థితిపై సీఎం చంద్రబాబు సమీక్ష
- వేటకు వెళ్లలేని మత్స్యకార కుటుంబాలకు 50 కేజీల బియ్యం పంపిణీకి ఆదేశం
- ప్రకాశం బ్యారేజీకి ఎగువ, దిగువన కొత్త బ్యారేజీల నిర్మాణ ప్రతిపాదనలు
- తాజా వర్షాలతో రాష్ట్రంలోని జలాశయాల్లోకి 21 టీఎంసీల అదనపు నీరు
- రాష్ట్రంలో వర్షపాతం లోటు 50 శాతం నుంచి 31 శాతానికి తగ్గుదల



**పెన్ పవర్ డెస్క్:**గత కొద్దిరోజులుగా రాష్ట్రవ్యాప్తంగా, ముఖ్యంగా ఉత్తరాంధ్రలో కురుస్తున్న భారీ వర్షాలు, వరద పరిస్థితిపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శనివారం ఉన్నతాధికారులతో టెలీకాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ముంపు ప్రాంతాల్లో సహాయక చర్యలను ముమ్మరం చేయాలని, వేటకు వెళ్లలేక ఇబ్బందులు పడుతున్న మత్స్యకార కుటుంబాలకు తక్షణ సాయంగా 50 కేజీల బియ్యం అందించాలని ఆదేశించారు. అదే సమయంలో కృష్ణా నదిపై రెండు కొత్త బ్యారేజీల నిర్మాణానికి సంబంధించిన ప్రతిపాదనలను వేగవంతం చేయాలని అధికారులకు కీలక సూచనలు చేశారు.శనివారం జరిగిన ఈ సమీక్షలో అధికారులు రాష్ట్రంలోని తాజా పరిస్థితిని సీఎంకు వివరించారు. ఉత్తరాంధ్రలో నదులు ఉద్ధృతంగా ప్రవహిస్తున్నాయని, పలుచోట్ల నివాస ప్రాంతాలు, పంట పొలాలు నీట మునిగాయని తెలిపారు. సహాయక చర్యలపై ఆరా తీసిన ముఖ్యమంత్రి, ఎక్కడా ప్రజలు ఇబ్బంది పడకుండా చూడాలని స్పష్టం చేశారు. ఐదు రోజులుగా సముద్రంలోకి వెళ్లలేని మత్స్యకారుల పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని వారికి అండగా నిలవాలని, తక్షణమే బియ్యం పంపిణీ చేయాలని ఆదేశించారు.

**కృష్ణాపై కొత్త బ్యారేజీలు.. నీటి భద్రతపై దృష్టి**

ఈ సందర్భంగా స్థానికంగా కురుస్తున్న వర్షాల వల్ల ప్రకాశం బ్యారేజీకి వరద నీరు పెరుగుతోందని అధికారులు తెలపగా, ఆ నీటిని పూర్తిస్థాయిలో నిల్వ చేసుకునే మార్గాలపై దృష్టి పెట్టాలని సీఎం సూచించారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని పులిచింతల-ప్రకాశం బ్యారేజీ మధ్య ఒకటి, ప్రకాశం బ్యారేజీకి దిగువన మరొకటి చొప్పున రెండు కొత్త బ్యారేజీల నిర్మాణం అవసరమని చంద్రబాబు పునరుద్ఘాటించారు. ఈ రెండు ప్రాజెక్టులకు సంబంధించి గతంలో రూపొందించిన ప్రతిపాదనలను ముందుకు తీసుకెళ్లి, కేంద్ర ప్రభుత్వానికి పంపాలని అధికారులను ఆదేశించారు. అలాగే, హిర మండలం లిఫ్ట్ ప్రాజెక్టుకు విద్యుత్ సౌకర్యం కల్పించి, వంశధార నీటిని రిజర్వాయర్‌లోకి తరలించే పనులను వేగవంతం చేయాలని ఇరిగేషన్, విద్యుత్ శాఖల అధికారులకు సూచించారు.

- మిగతా 2లో

## ఈసీ ప్రకటనతో అపోహలకు తెరపడింది

- ఎన్నికల కమిషనర్ల మధ్య విభేదాలంటూ ప్రచారం
- ఢిల్లీలో కీలక సమావేశంతో క్లారిటీ ఇచ్చిన ఈసీ
- తమ మధ్య విభేదాలు లేవంటూ సంయుక్త ప్రకటన విడుదల
- సోషల్ మీడియాలో స్పందించిన ఏపీ సీఎం చంద్రబాబు
- రాజ్యాంగ సంస్థల సమగ్రతను, విశ్వసనీయతను గౌరవించాలని పిలుపు
- గెలుపోటములను హుందాగా స్వీకరించడమే నాయకత్వ లక్షణమని ఉద్ఘాటన



**పెన్ పవర్ డెస్క్:**భారత ఎన్నికల సంఘం (ఈసీఐ)లో కమిషనర్ల మధ్య విభేదాలు తలెత్తాయంటూ వచ్చిన వార్తలపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పందించారు. ఇవాళ ఓ కీలక సమావేశం సందర్భంగా ఈసీ ఇచ్చిన ఏకగ్రీవ ప్రకటనతో అన్ని అపోహలకు తెరపడిందని ఆయన పేర్కొన్నరు. మన రాజ్యాంగ సంస్థల సమగ్రతను, విశ్వసనీయతను ఈ ప్రకటన మరోసారి స్పష్టం చేసిందని ఎక్స్ వేదికగా శనివారం ఆయన పేర్కొన్నారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ అంశంపై నెలకొన్న వివాదం

- మిగతా 2లో

## కాంగ్రెస్‌తో కలవాలనే ఉద్దేశంతోనే జగన్ వైఖరి మార్చుకుంటున్నారా?

- ఓటర్ల జాబితా సవరణపై జగన్ ది ద్వంద్వ వైఖరి అంటూ ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు ఫైర్
- గతంలో కోర్టులో ఒకలా, ఇప్పుడు మరోలా మాట్లాడటమేంటని ప్రశ్న
- ఈసీల నియామకంపై మాట మార్చడం వెనుక ఆంతర్యమేమిటని నిలదీత
- 2029లో కాంగ్రెస్‌తో పొత్తు కోసమే జగన్ వ్యూహాలని ఆరోపణ

- మిగతా 2లో



## ఎన్నికల కమిషనర్ల మధ్య విభేదాలంటూ ప్రచారం..

### ప్రెస్ నోట్, గ్రూప్ ఫొటోతో చెక్ పెట్టిన ఈసీ

- ఈసీలో విభేదాల వార్తలను ఖండించిన పూర్తిస్థాయి కమిషన్
- నిర్ణయాలన్నీ ఏకగ్రీవమేనని స్పష్టం చేసిన ముగ్గురు కమిషనర్లు
- ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణపై నిర్ణయాన్ని సుప్రీంకోర్టు సమర్థించిందని వెల్లడి
- పనితీరును మెరుగుపర్చేందుకు అంతర్గత విధానాల్లో కీలక మార్పులు
- ఈసీఐనెట్ పోర్టల్‌పై సమీక్షకు ప్రత్యేక కమిటీ ఏర్పాటు



**పెన్ పవర్ డెస్క్:**భారత ఎన్నికల సంఘం (ఈసీఐ)లో కమిషనర్ల మధ్య తీవ్ర విభేదాలు తలెత్తాయంటూ గత కొద్ది రోజులుగా వస్తున్న వార్తలను కమిషన్ తీవ్రంగా ఖండించింది. ఈ ఆరోపణలకు తెరదించుతూ, ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ)

- మిగతా 2లో



## పరవాడ ఫార్మా కాలుష్యంపై పవన్ కల్యాణ్ సీరియస్..

### 95 కంపెనీలకు నోటీసులు

- ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆదేశాలతో ఫార్మాసిటీపై పీసీబీ చర్యలు
- సోషల్ మీడియా ఫిర్యాదు ఆధారంగా కాలుష్యంపై తనిఖీలు
- పరవాడలోని 95 ఫార్మా పరిశ్రమలకు షోకాజ్ నోటీసులు జారీ
- వ్యర్థాల నిర్వహణపై పరిశ్రమలకు కీలక దిద్దుబాటు చర్యల ఆదేశం

- మిగతా 2లో

## ఏపీ, కర్ణాటక పెద్దల ఆజ్ఞలను పాటిస్తూ ఇక్కడి నాణ్యమైన బొగ్గును ఆ రాష్ట్రాలకు తరలిస్తున్నారు



- విద్యుత్ రంగాన్ని రేవంత్ ప్రభుత్వం నాశనం చేసిందన్న జగదీశ్ రెడ్డి
- వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి రేవంత్ డైవర్షన్ డ్రామాలు ఆడుతున్నారని విమర్శ
- విద్యుత్ ఉత్పత్తిని పెంచాలని డిమాండ్

- మిగతా 2లో

## సీఈసీ రాజీనామా చేయాల్సిందే

### ఈసీ ప్రెస్ నోట్‌పై కాంగ్రెస్ ఫైర్

- ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామాకు కాంగ్రెస్ డిమాండ్
- ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను వెంటనే నిలిపివేయాలని పట్టు
- కోట్లాది మంది ఓటర్ల హక్కును హరించే కుట్ర జరుగుతోందని ఆరోపణ
- ఎన్నికల సంఘం ఇచ్చిన వివరణపై జైరాం రమేశ్ తీవ్ర విమర్శలు
- యువతను లక్ష్యంగా చేసుకుని జాబితాల నుంచి పేర్లు తొలగిస్తున్నారని ధ్వజం

- మిగతా 2లో



# ఎడిటర్ వ్యూ

## వైసీపీ స్ట్రాటజీ వర్క్ అవుట్ అవుతుందా? అందుకే టీడీపీని టార్గెట్ చేసిందా?

ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మెగా డీఎస్సీ చుట్టూ జరుగుతున్న రాజకీయ పోరు తీవ్ర స్థాయికి చేరింది. ఈ అంశం వెనుక వైసీపీ రాజకీయ అస్త్రాలు, వ్యూహాలు ఉన్నాయనే విశ్లేషణలు రాజకీయ వర్గాల్లో బలంగా వినిపిస్తున్నాయి. ముఖ్యంగా, విద్యాశాఖ మంత్రిగా ఉన్న నారా లోకేశ్ లక్ష్యంగా మరియు మిత్రపక్షాలైన టీడీపీ–బీజేపీ–జనసేన మధ్య సమతుల్యతను దెబ్బతీసే విధంగా ఈ వివాదాన్ని సజీవంగా ఉంచేందుకు వైసీపీ ప్రయత్నిస్తోందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. నారా లోకేశ్ లక్ష్యంగా వ్యూహంకూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మెగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసి నియామక ప్రక్రియను వేగవంతం చేసింది. అయితే, నియామకాలు పూర్తయిన తర్వాత ఈ ప్రక్రియలో, ముఖ్యంగా స్పోర్ట్స్ కోటా, పేపర్ లీకేజీ మరియు టెట్ అర్హతలలో అక్రమాలు జరిగాయంటూ వైసీపీ ఆరోపిస్తోంది. గవర్నర్ కు కూడా ఫిర్యాదు చేశారు. ఎన్ని కేసులు పెట్టినా యుద్ధం ఆగదని జగన్ స్పష్టం చేయడంతో కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ఎదుట టీడీపీని పలుచన చేయాలని భావిస్తున్నట్లుంది.

**లోకేశ్ ను టార్గెట్ చేయడం ద్వారా...**

విద్యా శాఖకు మంత్రిగా ఉన్న నారా లోకేశ్ ను నేరుగా టార్గెట్ చేయడం ద్వారా ఆయన రాజకీయ ప్రతిష్టను దెబ్బతీయడం వైసీపీ ప్రధాన వ్యూహంగా కనిపిస్తోంది.ఈ వ్యవహారంపై లోకేష్ రాజీనామా చేయాలని, సీబీఐ దర్యాప్తు జరిపించాలని జగన్ మోహన్ రెడ్డి డిమాండ్ చేస్తున్నారు. బీజేపీ ఎదుట టీడీపీని పలుచన చేసే వ్యూహమా?రాజకీయ విశ్లేషకుల ప్రకారం, వైసీపీ ఈ అంశాన్ని ఇంత పెద్ద ఎత్తున లేవనెత్తడం వెనుక కేంద్రంలో ఉన్న బీజేపీ పెద్దల దృష్టిని ఆకర్షించే వ్యూహం కూడా ఉండవచ్చు. పరిపాలనా లోపాలను ఎత్తిచూపడంతో అవినీతి రహిత, పారదర్శక పాలన అందిస్తామని కేంద్రానికి హామీ టీడీపీ ఇచ్చింది. రాష్ట్రంలో మొదటి పెద్ద రిక్రూట్‌మెంట్‌లోనే అక్రమాలకు పాల్పడిందనే ఇంప్రెషన్‌ను బీజేపీ హైకమాండ్ ముందు ఉంచాలని వైసీపీ భావిస్తుండవచ్చు.అందుకే మెగా డీఎస్సీని వదలకుండా పట్టుకుని బీజేపీ దృష్టిలో లోకేశ్ ను పలుచన చేస్తే ఆ ప్రభావం కూటమిపై పడుతుందని వైసీపీ అంచనా వేస్తున్నట్లు అనిపిస్తుంది.

**కేంద్ర సంస్థల జోక్యం కోసం డిమాండ్...**

రాష్ట్ర దర్యాప్తు సంస్థలపై నమ్మకం లేదని, కేవలం సీబీఐ విచారణ ద్వారానే నిజాలు బయటపడతాయని జగన్ పదే పదే ట్వీట్లు మరియు ప్రెస్ మీట్ల ద్వారా ఒత్తిడి పెంచుతున్నారు. దీని ద్వారా కూటమి భాగస్వామ్య పక్షాల మధ్య, ముఖ్యంగా టీడీపీ–బీజేపీ బంధంలో ఒక రకమైన ఇబ్బందికర వాతావరణాన్ని సృష్టించవచ్చనేది విపక్షాల అంతర్గత అంచనాగా కనిపిస్తోంది. గత వైసీపీ హయాంలో సరైన ఉద్యోగ నోటిఫికేషన్లు రాలేదనే అసంతృప్తి నిరుద్యోగుల్లో ఉందనే విమర్శలను కౌంటర్ చేయడానికి ఈ అంశం ఉపయోగపడుతుందని వైసీపీ భావిస్తోంది. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని కూటమి ప్రభుత్వం సాధించిన అతిపెద్ద విజయాల్లో ఒకటైన మెగా డీఎస్సీపై 'అక్రమాల మరక' వేయడం ద్వారా మైలేజ్ పొందాలని ప్రతిపక్షం భావిస్తోంది. నిరుద్యోగ యువతలో కూటమి ప్రభుత్వంపై నమ్మకాన్ని సడలించేలా ప్రచారం చేయడం కూడా ఇందులో భాగమే. వైసీపీ చేస్తున్న ఆరోపణలను అధికార టీడీపీ తీవ్రంగా ఖండిస్తోంది. ఇదంతా కేవలం "దుష్ప్రచార వ్యూహం" అని కొట్టిపారేస్తోంది. మరి బీజేపీ దృష్టిలో టీడీపీని పలుచన చేయాలన్న వైసీపీ వ్యూహం ఎంత మేరకు పలుచన చేస్తుందన్నది చూడాలి.

## ఏపీ, కర్ణాటక పెద్దల ఆజ్ఞలను పాటిస్తూ ఇక్కడి నాణ్యమైన బొగ్గును ఆ రాష్ట్రాలకు తరలిస్తున్నారు

కాంగ్రెస్ ప్రభుత్వంపై మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ఇచ్చిన హామీల అమలులో రేవంత్ రెడ్డి సర్కార్ పూర్తిగా విఫలమైందని, సాగు, తాగునీటితో పాటు విద్యుత్ రంగంలోనూ అరాచకం సృష్టిస్తోందని మండిపడ్డారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు ఎప్పుడూ డైవర్షన్ డ్రామాలు ఆడుతుంటారని దుయ్యబట్టారు. సింగరేణి బొగ్గు ఉత్పత్తిపై ప్రభుత్వం తప్పుడు లెక్కలు చెబుతోందని, ఏకంగా 40 లక్షల టన్నుల బొగ్గును మాయం చేశారని సంచలన ఆరోపణలు చేశారు. ఏపీ, కర్ణాటక ప్రభుత్వాల పెద్దల ఆజ్ఞలను పాటిస్తూ ఇక్కడి నాణ్యమైన బొగ్గును ఆ రాష్ట్రాలకు తరలిస్తున్నారని దుయ్యబట్టారు. ఇక యాదాద్రి పవర్ ప్లాంట్‌పై కాంగ్రెస్ నేతలు అసత్య ప్రచారాలు చేస్తున్నారని, సిమెంట్ పరిశ్రమలకు అవసరమైన యాష్ (బూడిద) అవసరాలను దృష్టిలో ఉంచుకునే దాన్ని దామరచర్లలో ఏర్పాటు చేశామని స్పష్టం చేశారు. ఎండిపోతున్న పొలాలు సీఎం రోజువారీ డ్రామాలతో పండవని, ఇప్పటికైనా అనవసరపు పనులు మాని పూర్తిస్థాయిలో విద్యుత్ ఉత్పత్తిని పెంచాలని డిమాండ్ చేశారు.పాలిచ్చే ఆవులాంటి ట్రాన్స్‌కోను తన సన్నిహితులకు కట్టబెట్టేందుకు సీఎం రేవంత్ కుట్ర పన్నుతున్నారని జగదీశ్ రెడ్డి ఆరోపించారు. దేశంలో ఢిల్లీ, ముంబై, ఒడిశా వంటి ప్రాంతాల్లో విద్యుత్ రంగాన్ని ప్రైవేటీకరించిన చోట ప్రజలపై విపరీతమైన భారం పడిందని అన్నారు. కేసీఆర్ మీద ఎంత ఒత్తిడి ఉన్నా నాటి ప్రభుత్వం విద్యుత్ రంగాన్ని ప్రైవేట్‌పరం చేయలేదని, కానీ ప్రస్తుత సర్కార్ మాత్రం కమీషన్లకు ఆశపడి ట్రాన్స్‌కో లక్షల కోట్ల ఆస్తులను కారుచౌకగా అమ్మేయాలని చూస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ నిర్ణయంతో ట్రాన్స్‌కో ఉద్యోగులు తీవ్ర ఆందోళనలో ఉన్నారని, ప్రశ్నించిన అధికారులపై ఏసీబీ కేసుల పేరుతో బెదిరింపులకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ అనుసరించే ఈ ప్రజా వ్యతిరేక విధానాలపై బీఆర్ఎస్ తీవ్రంగా పోరాడుతుందని హెచ్చరించారు.నాటి సీఎం కేసీఆర్ చొరవతోనే తెలంగాణ చీకట్ల నుంచి వెలుగులోకి వచ్చిందని కొనియాడారు. అసాధ్యమనుకున్న 24 గంటల నాణ్యమైన ఉచిత విద్యుత్‌ను కొన్ని నెలల వ్యవధిలోనే అన్ని వర్గాలకు అందించిన ఘనత బీఆర్ఎస్‌దేనని స్పష్టం చేశారు. కేవలం ట్రాన్స్‌కోపైనే రూ.36 వేల కోట్లు వెచ్చించి, ఎక్కడ విద్యుత్ సరఫరా నిలిచినా మరో మార్గం ద్వారా అనుసంధానించే అధునాతన గ్రిడ్ వ్యవస్థను హైదరాబాద్‌లో ఏర్పాటు చేశామని గుర్తుచేశారు.

## కర్నూలులో ఏవియేషన్ అకాడమీ రావడం చరిత్రాత్మకం

రాష్ట్రంలోనే ప్రప్రథమంగా కర్నూలు ఎయిర్‌పోర్టులో ఏవియేషన్ ట్రైనింగ్ సెంటర్ అందుబాటులోకి రావడం చరిత్రాత్మకమని రాష్ట్ర మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. కర్నూలు విమానాశ్రయం వేదికగా ఈరోజు 'ఓరియంట్ ఫ్లైట్స్ ఏవియేషన్ అకాడమీ' ఘనంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, మంత్రులు బీసీ జనార్దన్ రెడ్డి, టీజీ భరత్, ఎంపీ బస్తిపాటి నాగరాజు, జిల్లా కలెక్టర్ సిరి, స్థానిక ఎమ్మెల్యేలు గౌరు చరితారెడ్డి, కేఈ శ్యామ్ బాబుతో పాటు అకాడమీ చైర్మన్ ఆనంద్ జాకబ్ వర్గీస్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా భవిష్యత్ ప్రణాళికలపై మాట్లాడిన మంత్రి జనార్దన్ రెడ్డి... ఓర్వకల్లులో అత్యాధునిక హంగులతో 'డ్రోన్ సిటీ'ని ఏర్పాటు చేయబోతున్నట్లు ప్రకటించారు. దీన్ని రెండు దశలుగా అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. తొలి విడతలో 180 ఎకరాల్లో, ఆ తర్వాత రెండో దశలో మరో 400 ఎకరాల విస్తీర్ణంలో ఈ ప్రాజెక్ట్‌ను చేపట్టనున్నట్లు ఆయన వెల్లడించారు.గతంలో 2017లో కర్నూలు ఎయిర్‌పోర్టు నిర్మాణానికి పునాదిరాయి వేసి, అతి తక్కువ కాలంలోనే దానిని పూర్తి చేసి ప్రజలకు అంకితం చేశామని జనార్దన్ రెడ్డి గుర్తుచేశారు. రాబోయే రోజుల్లో ఏవియేషన్ సెక్టార్‌లో ప్రొఫెషనల్స్, పైలట్లకు డిమాండ్ విపరీతంగా పెరగనుందని తెలిపారు. ఈ కొత్త ట్రైనింగ్ సెంటర్ ద్వారా కర్నూలు జిల్లా యువతతో పాటు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న విద్యార్థులకు విమానయాన రంగంలో నిపుణులుగా శిక్షణ పొందే సువర్ణావకాశం లభిస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

# ఈసీ ప్రకటనతో అపోహలకు తెరపడింది

- మొదటి పేజీ తరువాయి

తాజాగా ఈసీ వివరణతో ముగిసిందని తెలిపారు.స్వల్పకాలిక రాజకీయ ప్రయోజనాల కోసం భారత ప్రజాస్వామ్య వ్యవస్థ, ఎన్నికల ప్రక్రియలపై ప్రజల్లో ఉన్న విశ్వాసాన్ని దెబ్బతీసే ప్రయత్నాలు చేయడం దురదృష్టకరమని చంద్రబాబు అభిప్రాయపడ్డారు. ఎన్నికల ఫలితాలు ప్రజల తీర్పును ప్రతిబింబిస్తాయని, బలమైన ప్రజాస్వామ్యంలో గెలుపును, ఓటమిని సమానంగా, హుందాగా స్వీకరించడమే నిజమైన నాయకత్వ లక్షణమని హితవు పలికారు. రాజ్యాంగ సంస్థలను గౌరవించడం అత్యంత ముఖ్యమని, భారత ప్రజాస్వామ్య ప్రక్రియపై ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టడం పార్టీలకు అతీతంగా నాయకులందరి ఉమ్మడి బాధ్యత అని ఆయన గుర్తుచేశారు.

**సంయుక్త ప్రకటనతో వివాదానికి ముగింపు**

కాగా, గత కొద్ది రోజులుగా తమ మధ్య తీవ్ర విభేదాలు ఉన్నాయంటూ వస్తున్న ఊహాగానాలకు భారత ఎన్నికల సంఘం పూర్తిస్థాయి కమిషన్ శనివారం తెరదించింది. ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్, ఎన్నికల కమిషనర్లు సుఖ్బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి న్యూఢిల్లీలోని నిర్వాచన్ సదన్‌లో సమావేశమయ్యారు. అనంతరం ముగ్గురూ కలిసి ఉన్న ఫోటోతో పాటు ఒక సంయుక్త ప్రకటనను విడుదల చేశారు. కమిషన్ అంతర్గత పనితీరు, ఓటర్ల జాబితా సవరణ, సాంకేతిక వ్యవస్థలపై వస్తున్న ఆరోపణలను తీవ్రంగా ఖండించారు.

**వివాదానికి నేపథ్యం ఇదే..**

ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణకు సంబంధించిన పలు నిర్ణయాలపై కమిషనర్లు సంధు, జోషి అభ్యంతరాలు వ్యక్తం చేశారంటూ సెప్టెంబర్ 23న ఓ ప్రముఖ ఆంగ్ల పత్రికలో కథనం ప్రచురితమైంది. ఈ కథనం దేశవ్యాప్తంగా రాజకీయ దుమారం రేపింది. ప్రతిపక్ష పార్టీలు ఎన్నికల సంఘం పనితీరుపై సందేహాలు వ్యక్తం చేస్తూ, మరింత పారదర్శకత అవసరమని డిమాండ్ చేశాయి. ఈ నేపథ్యంలోనే పూర్తిస్థాయి కమిషన్ సంయుక్తంగా స్పందించి, తమ మధ్య ఎలాంటి విభేదాలు లేవని స్పష్టం చేసింది.

రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కోసం 2025 జూన్ 24న జారీ చేసిన ఆదేశాలను ముగ్గురు కమిషనర్లు ఏకగ్రీవంగా ఆమోదించారని ఈసీ తన ప్రకటనలో పేర్కొంది. ఆ తర్వాత కార్యక్రమ షెడ్యూళ్లను కూడా ఏకాభిప్రాయంతోనే విడుదల చేశామని తెలిపింది. ఈ ఆదేశాలను సుప్రీంకోర్టు సైతం సమర్థించిందని గుర్తుచేసింది. నిర్ణయాలన్నీ సమష్టిగా, సంస్థాగత విధివిధానాలను అనుసరించే తీసుకుంటామని కమిషన్ స్పష్టం చేసింది.

# కాంగ్రెస్‌తో కలవాలనే ఉద్దేశంతోనే జగన్ వైఖరి మార్చుకుంటున్నారా?

వైసీపీ అధినేత జగన్ పై టీడీపీ ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. జగన్‌ది అవకాశవాద, ద్వంద్వ వైఖరి అని ఆరోపిస్తూ సోషల్ మీడియా వేదికగా పలు కీలక ప్రశ్నలు సంధించారు. ఆయన రాజకీయ సౌలభ్యం కోసం వైఖరులు మార్చుకుంటున్నారని ఘాటుగా విమర్శించారు.

ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియపై ఇప్పుడు ఆరోపణలు చేస్తున్న జగన్, గతంలో స్థానిక సంస్థల ఎన్నికల కోసం ఇదే ప్రక్రియను ప్రామాణికంగా తీసుకున్నారని లావు గుర్తుచేశారు."ఎస్ఐఆర్ పూర్తయ్యాకే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని మీ పార్టీ ఎమ్మెల్సీ లెల్ల అప్పిరెడ్డి హైకోర్టును ఆశ్రయించిన విషయం వాస్తవం కాదా? కోర్టులో ఒకలా, ఇప్పుడు మరోలా మాట్లాడటంలోని ఆంతర్యమేమిటి?" అని ఆయన ప్రశ్నించారు.అదేవిధంగా, ఎన్నికల కమిషనర్ల నియామక ప్యానెల్ నుంచి భారత ప్రధాన న్యాయమూర్తిని (సీజేఐ) తొలగిస్తూ 2023లో కేంద్ర ప్రభుత్వం తెచ్చిన చట్టానికి వైసీపీ మద్దతు ఇచ్చిందని లావు పేర్కొన్నారు. కానీ ఇప్పుడు, ప్రధాని, ప్రతిపక్ష నేతతో పాటు సీజేఐ కూడా ప్యానెల్‌లో ఉండాలని జగన్ డిమాండ్ చేయడం ఆయన ద్వంద్వ వైఖరికి నిదర్శనమని విమర్శించారు.ఈ ఆకస్మిక మార్పుల వెనుక రాజకీయ వ్యూహం ఉందని లావు అనుమానం వ్యక్తం చేశారు. 2029 ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని, తన మాతృ సంస్థ అయిన కాంగ్రెస్‌తో రాజకీయంగా కలవాలనే ఉద్దేశంతోనే జగన్ ఇలా తన వైఖరిని మార్చుకుంటున్నారా? అని ఆయన సూటిగా ప్రశ్నించారు.

# పరవాడ ఫార్మా కాలుష్యంపై పవన్ కల్యాణ్ సీరియస్.. 95 కంపెనీలకు నోటీసులు

సోషల్ మీడియాలో వచ్చిన ఒక ఫిర్యాదుపై రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తక్షణమే స్పందించారు. ఆయన ఆదేశాలతో అనకాపల్లి జిల్లా పరవాడ ఫార్మాసిటీలోని 95 పరిశ్రమలకు ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి (ఏపీపీసీబీ) షోకాజ్ నోటీసులు జారీ చేసింది. శుద్ధి చేయని వ్యర్థాలను వర్షపు నీటి కాలువల్లోకి విడుదల చేస్తూ కాలుష్యానికి కారణమవుతున్నారన్న ఆరోపణలపై ఈ చర్యలు తీసుకుంది.వివరాల్లోకి వెళితే, పరవాడ ఫార్మాసిటీ సమీపంలోని డ్రెయిన్లలో నల్లటి రంగులో, దుర్వాసనతో కూడిన నీరు ప్రవహిస్తున్నట్లు శుక్రవారం ఇన్‌స్టాగ్రామ్‌లో ఒక వీడియో పోస్ట్ అయింది. ఈ వీడియో ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ దృష్టికి వెళ్లడంతో, వెంటనే క్షేత్రస్థాయిలో విచారణ జరిపి వాస్తవాలపై సమగ్ర నివేదిక ఇవ్వాలని ఆయన పీసీబీ అధికారులను ఆదేశించారు.డిప్యూటీ సీఎం ఆదేశాలతో రంగంలోకి దిగిన పీసీబీ అధికారులు, వీడియోలో కనిపించిన ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టారు. నమూనాలను సేకరించి పరిశీలించగా, శుద్ధి చేయని వ్యర్థ జలాలు వర్షపు నీటి కాలువల్లోకి చేరుతున్నట్లు ప్రాథమికంగా గుర్తించారు. దీనికి బాధ్యులుగా ఫార్మాసిటీలోని మొత్తం 95 కంపెనీలకు షోకాజ్ నోటీసులు జారీ చేసి, ఏడు రోజుల్లోగా వివరణ ఇవ్వాలని ఆదేశించారు.

కేవలం నోటీసులు ఇవ్వడమే కాకుండా, కాలుష్య నివారణకు పలు కఠినమైన దిద్దుబాటు చర్యలను కూడా పీసీబీ తప్పనిసరి చేసింది. పరిశ్రమల ప్రాంగణంలోనే వర్షపు నీటిని నిల్వ చేయాలని, కలుషిత నీటిని బయటకు వదలరాదని స్పష్టం చేసింది. వ్యర్థాల నిర్వహణను డిజిటలైజ్ చేయాలని, తేదీ, సమయంతో సహా రికార్డ్ చేసే సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేసి ఫుటేజీని ఆరు నెలల పాటు భద్రపరచాలని సూచించింది. ఆన్‌లైన్ మానిటరింగ్ వ్యవస్థతో కూడిన స్క్రబ్బర్లను వాడాలని, పర్యావరణ అనుమతుల నిబంధనలను కచ్చితంగా పాటించాలని ఆదేశాల్లో పేర్కొంది.నిర్ణీత సమయంలో సంతృప్తికరమైన సమాధానం ఇవ్వని, అక్రమంగా వ్యర్థాలను విడుదల చేస్తున్నట్లు తేలిన పరిశ్రమలపై పర్యావరణ పరిరక్షణ చట్టాల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని పీసీబీ హెచ్చరించింది. తీసుకున్న చర్యలపై ఒక సమగ్ర నివేదికను ఉప ముఖ్యమంత్రి కార్యాలయానికి పంపినట్లు అధికారులు తెలిపారు.

# ఎన్నికల కమిషనర్ల మధ్య విభేదాలంటూ ప్రచారం..

- మొదటి పేజీ తరువాయి

జ్ఞానేశ్ కుమార్, ఎన్నికల కమిషనర్లు సుఖ్బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి శనివారం న్యూఢిల్లీలోని నిర్వాచన్ సదన్‌లో సమావేశమయ్యారు. అనంతరం ముగ్గురూ కలిసి ఉన్న గ్రూప్ ఫోటోతో పాటు ఒక సుదీర్ఘమైన ప్రెస్ నోట్‌ను విడుదల చేశారు. కమిషన్ అంతర్గత పనితీరు, ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (ూ×=), ఓటర్ల నమోదు ప్రక్రియ, సాంకేతిక వ్యవస్థలపై వస్తున్న ఆరోపణలపై ఇందులో సమగ్రంగా వివరణ ఇచ్చారు.

ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణకు సంబంధించిన పలు నిర్ణయాలపై కమిషనర్లు సంధు, జోషి అభ్యంతరాలు వ్యక్తం చేశారని సెప్టెంబర్ 23న ఓ ఆంగ్ల పత్రికలో కథనం ప్రచురితమైన సంగతి తెలిసిందే. ఈ కథనం దేశవ్యాప్తంగా రాజకీయ దుమారం రేపింది. ప్రతిపక్ష పార్టీలు ఎన్నికల సంఘం పనితీరుపై సందేహాలు వ్యక్తం చేస్తూ, మరింత పారదర్శకత అవసరమని డిమాండ్ చేశాయి. ఈ నేపథ్యంలోనే పూర్తిస్థాయి కమిషన్ సంయుక్తంగా స్పందించింది.రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ కోసం 2025 జూన్ 24న జారీ చేసిన ఆదేశాలను ముగ్గురు కమిషనర్లు ఏకగ్రీవంగా ఆమోదించారని ఈసీ తన ప్రకటనలో స్పష్టం చేసింది. ఆ తర్వాత ఈ కార్యక్రమానికి సంబంధించిన షెడ్యూళ్లను కూడా ఏకాభిప్రాయంతోనే విడుదల చేశామని తెలిపింది. ఈ ప్రత్యేక సవరణ ఆదేశాలను సుప్రీంకోర్టు సైతం సమర్థించిందని గుర్తుచేసింది.కొత్త ఓటర్ల నమోదుకు ఉపయోగించే ఫారం–6లో, దరఖాస్తుదారులు తమ తల్లిదండ్రుల పేర్ల ద్వారా గత సవరణతో తమ సంబంధాన్ని ధ్రువీకరించాలనే నిబంధనపై వస్తున్న విమర్శలపైనా కమిషన్ స్పందించింది. ఈ డిక్లరేషన్‌ను కూడా సుప్రీంకోర్టు సమర్థించిందని తెలిపింది. అయితే, ఈ నిబంధన కేవలం ప్రత్యేక సవరణ ప్రక్రియకు మాత్రమే వర్తిస్తుందని, మిగతా సమయాల్లో ఎలక్టర్ల నమోదు నిబంధనలు, 1960 ప్రకారం నిర్దేశించిన ఫారాలనే వాడతామని స్పష్టం చేసింది.గోవాలో 97 మంది ఓటర్ల పేర్లు జాబితా నుంచి తొలగిపోవడంపై కూడా ఈసీ వివరణ ఇచ్చింది. ఇంటింటి సర్వే నిర్వహించి, అవసరమైన ఫారాలను సేకరించాలని గోవా చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ (సీఈఓ) సంబంధిత బూత్ లెవల్ అధికారులను ఆదేశించారని పేర్కొంది. ఇప్పటికే ఆ 97 మందిలో 81 మంది తమ పేర్లను చేర్చాలని కోరుతూ ఫారం–6 సమర్పించారని వెల్లడించింది.

ఇక, ఎలక్టోరల్ రోల్ డేటాబేస్‌కు యాక్సెస్ విషయంలో ఈసీఐనెట్ (జుజ×చీజు) పోర్టల్‌పై తలెత్తిన ఆందోళనలపైనా కమిషన్ స్పందించింది. క్షేత్రస్థాయి అధికారులకు వారి చట్టబద్ధమైన అధికారాలకు అనుగుణంగానే 'రోల్–బేస్డ్ యాక్సెస్' ఇస్తామని స్పష్టం చేసింది. ఈ పోర్టల్ పనితీరును సమీక్షించేందుకు ఓ సీనియర్ డిప్యూటీ ఎన్నికల కమిషనర్ నేతృత్వంలో కమిటీని ఏర్పాటు చేస్తున్నట్లు, ఇందులో ఐఐటీ లేదా ట్రిపుల్ ఐటీకి చెందిన స్వతంత్ర నిపుణుడు కూడా ఉంటారని ప్రకటించింది. క్యాబినెట్ సెక్రటరీకి పంపిన లేఖ ఈసీ విధానపరమైన అంశాలకు సంబంధించింది కాదని, డిప్యుటేషన్‌పై ఉన్న ఓ అధికారి పని పునఃపంపిణీకి మాత్రమే సంబంధించిందని కమిషన్ స్పష్టం చేసింది.

అంతర్గత పనివిధానాలను మరింత బలోపేతం చేసేందుకు పలు చర్యలు తీసుకుంటున్నట్లు ఈసీ ప్రకటించింది. ఇకపై కమిషన్ సమావేశాల అజెండాలను సభ్యులకు ముందుగానే సర్క్యులేట్ చేయాలని, సమావేశం అనంతరం మినిట్స్ జారీ చేయాలని నిర్ణయించింది. కమిషనర్లు అధికారులకు జారీ చేసే ఆదేశాలను కచ్చితంగా పాటించాలని స్పష్టం చేసింది. ఢిల్లీ, మహారాష్ట్రల్లో ప్రత్యేక సవరణ గడువును పొడిగిస్తున్నట్లు తెలిపింది. తమ ప్రధాన నిర్ణయాలన్నీ సమష్టిగా, ఏకగ్రీవంగానే తీసుకున్నామని కమిషన్ పునరుద్ఘాటించింది.

# సీఎం విజయ్ నటనను ఇంకా ఆపలేదు: స్టాలిన్

తమిళనాడు ముఖ్యమంత్రి, టీవీకే అధినేత విజయ్‌పై మాజీ ముఖ్యమంత్రి, డీఎంకే అధినేత ఎం.కే. స్టాలిన్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. సినిమాలకు స్వస్తి పలికినప్పటికీ, ప్రజల ముందు విజయ్ ఇంకా నటిస్తూనే ఉన్నారని ఆయన ఎద్దేవా చేశారు. ఈ మేరకు శనివారం 'ఎక్స్' వేదికగా ఆయన ఒక పోస్ట్ చేశారు.

మధురాంతకం అసెంబ్లీ ఉప ఎన్నికల ప్రచారంలో విజయ్ నటనను తాను ప్రత్యక్షంగా చూశానని స్టాలిన్ పేర్కొన్నారు. డీఎంకేను ఒక దుష్టశక్తిగా, టీవీకేను పవిత్ర శక్తిగా విజయ్ అభివర్ణించడం హాస్యాస్పదమని విమర్శించారు. విజయ్ ప్రభుత్వ హయాంలో పరిపాలన పూర్తిగా విఫలమైందని, రాష్ట్రంలో విద్యుత్ కోతలు, నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదల, పాల కొరత, శాంతిభద్రతల క్షీణత వంటి సమస్యలు పెరిగిపోయాయని ఆరోపించారు. గత డీఎంకే ప్రభుత్వ పథకాలకే పేర్లు మార్చి టీవీకే ప్రభుత్వం అమలు చేస్తోందని ఆయన మండిపడ్డారు.జెమ్ గ్రానైట్స్ ఛైర్మన్ ఆర్. వీరమణికి సంబంధించిన పోక్సో కేసులో డీఎంకేపై విజయ్ చేస్తున్న ఆరోపణలు కేవలం నిరాధారమని స్టాలిన్ కొట్టిపారేశారు. ఈ విషయంపై తాను ఇప్పటికే అసెంబ్లీలో స్పష్టమైన వివరణ ఇచ్చానని గుర్తుచేశారు. దర్యాప్తు దశలో ఉన్న అంశాలను రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకోవద్దని మద్రాస్ హైకోర్టు ఆదేశించినప్పటికీ, ఎన్నికల ప్రచారంలో విజయ్ పదేపదే ఈ అంశాన్ని ప్రస్తావించడం సరికాదన్నారు. ఇప్పటికైనా ప్రజల ముందు నటించడం మాని, ముఖ్యమంత్రి పదవికి ఉండాల్సిన రాజకీయ హుందాతనాన్ని ప్రదర్శించాలని విజయ్‌కు స్టాలిన్ హితవు పలికారు.

## భారీ వర్షాలతో ఉత్తరాంధ్ర అతలాకుతలం..

### నిండిన జలాశయాలు.. తగ్గిన వర్షపాతం లోటు

తాజా వర్షాల వల్ల రాష్ట్రంలోని 29 ప్రధాన రిజర్వాయర్లలోకి భారీగా నీరు వచ్చి చేరినట్లు ఇరిగేషన్ అధికారులు సీఎంకు వివరించారు. సెప్టెంబర్ 23 నాటికి 101 టీఎంసీలుగా ఉన్న నీటి నిల్వ, కేవలం మూడు రోజుల్లో 21 టీఎంసీలు పెరిగి 122 టీఎంసీలకు చేరిందని తెలిపారు. ఒక్క ఉత్తరాంధ్రలోని 11 ప్రాజెక్టుల్లోనే సుమారు 5 టీఎంసీల నీరు అదనంగా చేరిందని వివరించారు. ఈ వర్షాల వల్ల రాష్ట్రంలో వర్షపాతం లోటు 50 శాతం నుంచి 31 శాతానికి తగ్గిందని అధికారులు తెలిపారు.

గోదావరిపై ధవళేశ్వరం బ్యారేజీ వద్ద ప్రవాహం 1.20 లక్షల క్యూసెక్కుల నుంచి 3.50 లక్షల క్యూసెక్కులకు పెరిగింది. వంశధారపై గొట్టా బ్యారేజీకి, నాగావళిపై నారాయణపురం ఆనకట్టకు కూడా ఇన్‌ఫ్లో రికార్డు స్థాయిలో పెరిగింది. పెరిగిన ప్రవాహాలను సద్వినియోగం చేసుకుని రిజర్వాయర్లతో పాటు చిన్న, మధ్య తరహా నీటి వనరులను కూడా నింపాలని సీఎం ఆదేశించారు. వరద తగ్గుముఖం పట్టినా, ముంపు ప్రాంతాల్లో సహాయక చర్యలు కొనసాగించాలని స్పష్టం చేశారు. ఈ సమీక్షలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్‌తో పాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## 10 శాతం వృద్ధి సాధ్యమే

దేశ ఆర్థిక వృద్ధి రేటు 10 శాతం మార్కును అధిగమించాలంటే అన్ని రంగాల్లోనూ అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞాన వినియోగాన్ని పెంచాల్సిన ఆవశ్యకత ఉందని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), సెమీకండక్టర్లు, క్వాంటం టెక్నాలజీ వంటి భవిష్యత్ సాంకేతిక విభాగాల్లో భారీగా పెట్టుబడులు పెట్టడం ద్వారానే దేశం అభివృద్ధి పథంలో దూసుకెళుతుందని ఆమె స్పష్టం చేశారు. బెంగళూరులో నిర్వహించిన ఒక కార్యక్రమంలో ఆమె ఈ కీలక వ్యాఖ్యలు చేశారు.సాంకేతికత ఆధారంగా వివిధ రంగాల్లో మరిన్ని అంకుర సంస్థలు ఆవిర్భవించాలని ఆమె పిలుపునిచ్చారు. నూతన సాంకేతికతలను ప్రజలు సులభంగా అందిపుచ్చుకునేలా నైపుణ్యాభివృద్ధి, శిక్షణా కార్యక్రమాలకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. కేవలం దిగ్గజ సంస్థలకే పరిమితం కాకుండా, సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల్లో (ఎంఎస్ఎంఈ) సైతం ఏఐ వినియోగం గణనీయంగా పెరగాలని ఆమె ఆకాంక్షించారు.దేశ మౌలిక సదుపాయాల కల్పన, ఆర్థికాభివృద్ధిలో తదుపరి దశకు చేరుకోవాలంటే అన్ని విభాగాల్లోనూ డిజిటల్ వ్యవస్థలకు పెద్దపీట వేయాలని నిర్మలా సీతారామన్ వివరించారు. ఈ ఆధునిక సాంకేతిక రంగాలకు తగిన ప్రోత్సాహం అందిస్తే, దేశ భవిష్యత్తును మరింత ఉజ్వలంగా తీర్చిదిద్దవచ్చని ఆమె అభిప్రాయపడ్డారు.

## సీఈసీ రాజీనామా చేయాల్సిందే

భారత ఎన్నికల సంఘం ) తీరుపై కాంగ్రెస్ పార్టీ తీవ్ర స్థాయిలో విరుచుకుపడింది. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని, ఆయనపై విచారణ జరపాలని డిమాండ్ చేసింది. ఓటర్ల జాబితా సవరణ పేరుతో దేశవ్యాప్తంగా కోట్లాది మంది ఓటర్ల పేర్లను తొలగించే భారీ కుట్ర జరుగుతోందని ఆరోపించింది. ఈ సవరణ ప్రక్రియను తక్షణమే నిలిపివేయాలని కాంగ్రెస్ పార్టీ శనివారం గట్టిగా పట్టుబట్టింది.ఎన్నికల సంఘంలో అంతర్గత విభేదాలు ఉన్నాయంటూ మీడియాలో వచ్చిన కథనాల నేపథ్యంలో, ఈసీఐ నేడు ఓ ప్రెస్ నోట్ విడుదల చేసింది. ఈ వివరణ కాంగ్రెస్ ఆగ్రహాన్ని మరింత పెంచింది. ఈసీఐ ఇప్పుడు ఆత్మరక్షణలో పడిందని కాంగ్రెస్ సీనియర్ నేత, ఎంపీ జైరాం రమేశ్ విమర్శించారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్' వేదికగా వరుస పోస్టులతో ఈసీఐని, సీఈసీని లక్ష్యంగా చేసుకుని పలు ప్రశ్నలు సంధించారు."మీడియా కథనాల్లో వచ్చిన ఆరోపణలను ఈసీఐ తన ప్రెస్ నోట్‌లో ఎక్కడా నేరుగా ఖండించలేదు. వాటి తీవ్రతను తగ్గించే ప్రయత్నం మాత్రమే చేసింది. గోవా విషయంలో తప్పు చేసి దొరికిపోయాక, తొలగించిన 97 మందిలో 81 మంది పేర్లను తిరిగి చేర్చామని సిగ్గులేకుండా చెబుతోంది. అంటే, మొదట ఓటర్ల హక్కును కాలరాసి, దొరికిపోయాక మళ్లీ వారి పేర్లను చేర్చుతున్నామని చెప్పడం ఎంతవరకు సమంజసం?" అని జైరాం రమేశ్ ప్రశ్నించారు.ఢిల్లీ, మహారాష్ట్రల్లో ఓటరు నమోదు గడువును పొడిగించిన ఈసీఐ.. కర్ణాటక, తెలంగాణ, బిహార్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లో అన్యాయంగా ఓటు హక్కు కోల్పోయిన వారి పరిస్థితి ఏంటని నిలదీశారు. కేవలం ఒక వ్యక్తి అవినీతి వల్ల ఓటు హక్కు కోల్పోయిన ఈ రాష్ట్రాల ప్రజలకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత ఈసీఐకి లేదా అని ఆయన అన్నారు.సాంకేతిక సమస్యలను పరిష్కరించేందుకు ఐఐటీ/ట్రిపుల్ ఐటీ నిపుణులతో ఈసీనెట్ పోర్టల్‌ను సమీక్షిస్తామని చెప్పడం, సమస్య ఉందని అంగీకరించడమేనని జైరాం రమేశ్ పేర్కొన్నారు. సీఈసీ ఏకపక్ష నిర్ణయాలు, ప్రతిపక్షాలపై ద్వేషం, అధికార పార్టీకి అనుకూలంగా వ్యవహరించడం, ముఖ్యంగా యువ ఓటర్లను (జెన్ గ ) లక్ష్యంగా చేసుకోవడం వంటి అంశాలు ఆయన అవినీతిని బయటపెట్టాయని ఆరోపించారు. ఫారం 6లో పార్లమెంటు ఆమోదం లేకుండా మార్పులు చేసి, యువత ఓటు నమోదు చేసుకోకుండా అడ్డంకులు సృష్టిస్తున్నారని మండిపడ్డారు.సీఈసీ బ్యూరోక్రసీ ముసుగులో దాక్కోవాలని చూస్తున్నారని, కానీ ఆయన బండారం బట్టబయలైందని జైరాం రమేశ్ అన్నారు. దేశమంతా ఆయనను జవాబుదారీ చేయాలని చూస్తోందని, ఈ నేపథ్యంలో సీఈసీ రాజీనామా లేదా ఆయనపై విచారణ జరపడం మినహా మరో మార్గం లేదని స్పష్టం చేశారు.

## పాకిస్థాన్‌లో ఆత్మాహుతి దాడి.. 11 మంది మృతి

పాకిస్థాన్‌లో ఉగ్రవాదులు మరోసారి మారణహోమం సృష్టించారు. వాయవ్య పాకిస్థాన్‌లోని ఖైబర్ పఖ్తుంఖ్వా ప్రావిన్స్‌లో శనివారం చోటుచేసుకున్న ఆత్మాహుతి దాడిలో కనీసం 11 మంది ప్రాణాలు కోల్పోగా, మరో 30 మంది తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రుల్లో కొందరి పరిస్థితి విషమంగా ఉండటంతో మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు వెల్లడించారు.డేరా ఇస్మాయిల్ ఖాన్ జిల్లాలోని ఒక రహదారి పక్కన ఉన్న పోలీసు చెక్‌పోస్ట్‌ను లక్ష్యంగా చేసుకుని ఈ దాడి జరిగింది. పేలుడు పదార్థాలతో నింపిన వాహనంతో వచ్చిన ఆత్మాహుతి బాంబర్, చెక్‌పోస్ట్ సమీపంలోకి రాగానే తనను తాను పేల్చుకున్నాడు. ఈ పేలుడు ధాటికి ఆ ప్రాంతం ఒక్కసారిగా దద్దరిల్లింది. ఈ ఘటనలో భారీ స్థాయిలో ప్రాణ, ఆస్తి నష్టం సంభవించింది.ఈ ఘాతుకానికి తమదే బాధ్యతని పాకిస్థానీ తాలిబన్‌గా పిలిచే తెహ్రీక్–ఇ–తాలిబన్ పాకిస్థాన్ (టీటీపీ) ప్రకటించింది. ఇటీవలి కాలంలో పాకిస్థాన్‌లో ఉగ్రవాద కార్యకలాపాలు గణనీయంగా పెరిగాయి. ప్రధానంగా టీటీపీ, బలూచిస్థాన్ లిబరేషన్ ఆర్మీ (బీఎల్ఏ) వంటి వేర్పాటువాద సంస్థలు వరుస దాడులకు పాల్పడుతున్నాయి. ఈ తాజా ఘటనతో దేశంలోని భద్రతా వ్యవస్థలోని లోపాలపై మరోసారి తీవ్ర ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.

పెన్ పవర్
ఉత్తరాంధ్ర
శ్రీకాకుళం । మన్యం । విజయనగరం । విశాఖపట్నం । అనకాపల్లి । అల్లూరి జిల్లా

అంబులెన్స్ రాలేదు..

# డోలీమోతే దిక్కైంది!

**కొట్టుకుపోయిన డైవర్షన్ రోడ్డుతో గ్రామస్థుల అవస్థలు**



**గూడెంకొత్తవీధి, పెన్ పవర్, సెప్టెంబర్ 26:** గూడెంకొత్తవీధి మండలం వంచుల పంచాయతీ పరిధిలోని చీమగడ్డ గ్రామంలో నిర్మిస్తున్న బ్రిడ్జికి ఆనుకుని ఏర్పాటు చేసిన మట్టి డైవర్షన్ రోడ్డు ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కొట్టుకుపోయింది. దీంతో చీమగడ్డ గ్రామానికి వాహనాల రాకపోకలు నిలిచిపోయి, బ్రిడ్జికి అవతలే వాహనాలను నిలిపివేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. డైవర్షన్ రోడ్డు కొట్టుకుపోవడంతో అత్యవసర పరిస్థితుల్లో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న ఓ మహిళను డోలీపై బ్రిడ్జికి అవతలి వైపు వరకు తరలించి, అక్కడి నుంచి ఆటోలో ఆసుపత్రికి తీసుకెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడిందని స్థానికులు తెలిపారు. వర్షాలు తగ్గిన వెంటనే డైవర్షన్ రోడ్డును తాత్కాలికంగా పునరుద్ధరించడంతో పాటు బ్రిడ్జి నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని తెలుగు యువత మండల అధ్యక్షులు ముర్ల కోటేశ్వరరావు ప్రభుత్వాన్ని కోరారు. అధికారులు తక్షణమే స్పందించి గ్రామస్థుల రాకపోకలు, అత్యవసర వైద్య సేవలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# వేల కోట్ల తో జాతీయ రహదారి నిర్మాణం...!



- కాలపరిమితి కాకుండానే కుంగిపోయిన రిటర్నింగ్ వాల్ రోడ్డు...!
- జిల్లా స్థాయి అధికార్లు పర్యవేషణ లోపం ...
- తక్షణమే లోపభూయిష్ట హైవే రోడ్డుపై సమీక్ష జరపాలంటూ మాజీ మంత్రి వైఎస్సార్ సి పి సెంట్రల్ ఎగ్జిక్యూటివ్ సభ్యులు బాలరాజు డిమాండ్...

**కొయ్యూరు, పెన్ పవర్ సెప్టెంబర్ 26:** మూడు జిల్లాలను కలుపుతూ వేల కోట్ల రూపాయలతో నిర్మాణం చేపడుతున్న హైవే రోడ్డు 516 జాతీయ రహదారి నిర్మాణం కాలపరిమితి కాకుండానే కుంగిపోవటంమే కాకుండా వర్షాలకు సైతం పడిపోకుండా కొండలపై నుంచి జారిపోకుండా ఉండేందుకు నిర్మించిన రక్షణ గోడ కుంగిపోయి పెద్ద ప్రమాదం తప్పిన చింతాలమ్మ హైవే ఘాట్ రోడ్డులో విరిగిపడిన కొండచరియలు నిర్మాణం పూర్తిగా లోపభూయిష్టమైనదని మాజీ మంత్రి, వై ఎస్ఆర్ సి ఐ సెంట్రల్ ఎగ్జిక్యూటివ్ సభ్యులు పి. బాలరాజు ఆరోపించారు . కేవలం వందల సంవత్సరాల పాటు ఉండే విధంగా నిర్మించదలచిన ఈ హైవే రోడ్డు నిర్మించటంలో జిల్లా స్థాయి అధికార్లు, జిల్లా కలెక్టర్ వంటి వారెవరు కనీస పర్యవేక్షణ లేకపోవటమే ప్రధానలోపమేని బాలరాజు అన్నారు. ఇలాంటి నిర్మాణాలపై తక్షణమే చర్యలు తీసుకోవాలనీ ఆయన ప్రభుత్వాన్ని, జిల్లా కలెక్టర్ ను డిమాండ్ చేశారు. అల్లూరి జిల్లా కొయ్యూరు మండలంలోని చింతాలమ్మ ఘాట్ రోడ్డులో 516 జాతీయ రహదారి నిర్మాణం చేసి దాదాపు మూడేళ్ళు పూర్తి కాకుండానే ఎక్కడ పడితే అక్కడ కుంగిపోవడం, పెద్ద పెద్ద కల్వర్టు సైతం నెలరాలి రిటర్నింగ్ వాల్ తో పాటు రోడ్డు మధ్యలోనే చీలిపోవటం కుంగిపోవటం పట్ల ఈ జాతీయ రహదారి నిర్మాణం ఎంత నాణ్యత తో నిర్మిస్తున్నది ఏనాడైనా జిల్లా కలెక్టర్ మరియు సంబధిత శాఖ అధికారులు పర్యవేశించారా..!అని మాజీ మంత్రి బాలరాజు ప్రశ్నిస్తున్నారు. కేవలం ఒక ప్రొడక్షన్ వాల్ నిర్మించిన ఏడాది కాకుండానే పూర్తిగా కుంగిపోయిన పరిస్థితి పై జిల్లా కలెక్టర్ మరియు ఐటిడిఏ ప్రాజెక్టు అధికార్లు ఏం చెబుతారన్నారు. కేవలం నాణ్యత ప్రమాణాలు లేకుండా ఇంత పెద్ద మొత్తంలో వేల కోట్ల రూపాయలతో హైవే రోడ్డు నిర్మించటంలో లోపభూయిష్టమైన అధికార్లు పర్యవేక్షణ లేకపోవటమే ప్రధానలోపమేని బాలరాజు అన్నారు. అలాగే ఇదే జాతీయ రహదారి నిర్మాణం కోసం అనేక ప్రాంతాల్లో గిరిజన రైతులు తమ భూములు కోల్పోగా వాటికి నేటికి తగిన నష్టపరిహారం చెల్లించటంలో ప్రభుత్వం తాత్కారం చేయటం అన్యాయం అని ఆయన అన్నారు. ఘాట్ రోడ్డులో విరిగిపడిన కొండచరియలు నిర్మాణం పూర్తి లోపభూయిష్టమైనదే అయిన జిల్లా కలెక్టర్ కనీస పర్యవేక్షణ చేపట్టక పోవటం పట్ల మాజీ మంత్రి బాలరాజు ప్రామాణికమైన సంస్థ,కాంట్రాక్టర్లు పై విచారణ చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. ఇదే పరిస్థితిలో హైవే రోడ్డు నిర్మించటంలో లోపభూయిష్టమైన విధానం చాలా చోట్ల దర్శనం ఇస్తున్నా సంబధిత అధికార్లు తో కనీస సమీక్ష చేపట్టకపోవడం ఈ ప్రభుత్వ పాలన, అధికార్ల పాలన కు నిదర్శనం అని మాజీ మంత్రి వైఎస్సార్ సీపీ సెంట్రల్ ఎగ్జిక్యూటివ్ సభ్యులు బాలరాజు ఆరోపించారు. తక్షణమే ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుకుంటున్న హైవే రోడ్డు నిర్మించటంలో లోపభూయిష్టమైన విధానానికి ఇప్పటికైన ప్రభుత్వం స్పందించి తక్షణమే సక్రమంగా నిర్మాణాలు చేపట్టాలని లేని పక్షంలో తామంతా గిరిజనులతో కలిసి మరో ఉద్యమం చేపట్టడం తప్పదని మాజీ మంత్రి బాలరాజు హెచ్చరించారు.

# కిడ్నీ బాధిత బాలుడి వైద్యానికి గ్రామ యువత అండ



**దాతల సహకారంతో రూ.19,400 ఆర్థిక సాయం అందజేత**

**గూడెంకొత్తవీధి, పెన్ పవర్, సెప్టెంబర్ 26:** రెండు కిడ్నీల సమస్యతో బాధపడుతున్న 15 ఏళ్ల బాలుడు వంతల ప్రదీప్ కుమార్ వైద్య ఖర్చులకు మాడెం గ్రామ యువత అండగా నిలిచింది. బాలుడి పరిస్థితిని తెలుసుకున్న గ్రామ యువత స్పందించి, పత్రికా ప్రకటనల ద్వారా విషయం ప్రజల దృష్టికి తీసుకెళ్లడంతో పాటు రాజకీయ నాయకులు, దాతలను సంప్రదించి ఆర్థిక సహాయం అందించాలని విజ్ఞప్తి చేసింది. ఈ విషయంపై "పెన్ పవర్ "పత్రికలోనూ వార్త ప్రచురితమైంది. అనంతరం దుక్కేరి ప్రభాకర్‌ను సంప్రదించగా, ఆయన సహకారంతో డీపీఆర్ జై ఆదివాసీ జై భీమ్ స్వచ్ఛంద సేవా ట్రస్ట్ ద్వారా విరాళాల సేకరణకు ప్రయత్నాలు చేపట్టారు. గ్రామ యువత, డ్వాక్రా మహిళలు, దాతలు అందించిన సహకారంతో ఇప్పటివరకు మొత్తం రూ.19,400 సేకరించారు. సేకరించిన మొత్తాన్ని బాలుడి కుటుంబానికి గ్రామ యువత, దాతలు, డ్వాక్రా మహిళల తరఫున అందజేశారు. ఈ కష్ట సమయంలో కుటుంబానికి అండగా ఉంటామని భరోసా కల్పించారు. ఈ సందర్భంగా బాలుడి వైద్యానికి ఆర్థిక సహాయం అందించిన ప్రతి ఒక్క దాతకు, డ్వాక్రా మహిళలకు, గ్రామ యువతకు, సహకరించిన ప్రతి ఒక్కరికీ గ్రామ యువత హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపింది. బాలుడు వంతల ప్రదీప్ కుమార్ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించింది. కార్యక్రమంలో దుక్కేరి ప్రభాకర్, విజయ్, పాంగి దారబాబు, బురిడీ నాగరాజు, సీదారి మూర్తి, కూడ పల్లనాయుడు, బురిడీ సత్తిబాబు, వంతల కాశీరాజు తదితరులు, గ్రామస్తులు పాల్గొన్నారు. "ఆపదలో ఉన్న కుటుంబానికి అండగా నిలవడం మనందరి బాధ్యత. ఒక్కరి సహాయం చిన్నదైనా.. అందరి సహాయం ఒక కుటుంబానికి పెద్ద భరోసా అవుతుంది" అని గ్రామ యువత పేర్కొంది.


పెన్ పవర్

కిడ్నీలు దెబ్బతిన్న బాలుడికి ఆపన్నహస్తం కావాలి

గూడెంకొత్తవీధి, పెన్ పవర్, సెప్టెంబర్ 24: అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెంకొత్తవీధి మండలం దామనాపల్లి పంచాయతీ మాడెం గ్రామానికి చెందిన వంతల ప్రదీప్ కుమార్ (15) రెండు కిడ్నీలు దెబ్బతినడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాడు. ప్రదీప్ కుమార్ తల్లి మృతి చెందగా, తండ్రి వంతల మల్లేశ్వరరావు సంరక్షణలో ఉంటున్నాడు. కుటుంబం ఆర్థికంగా తీవ్ర ఇబ్బందుల్లో ఉండటంతో వైద్య చికిత్స, మందుల ఖర్చులు భరించడం కష్టంగా మారిందని కుటుంబ సభ్యులు తెలిపారు. బాలుడి పరిస్థితిని తెలుసుకున్న పలువురు దాతలు, సేవా సంస్థలు, మానవతావాదులు తమకు తోచిన సహాయం అందించి ప్రదీప్ కుమార్ వైద్య చికిత్సకు అండగా నిలవాలని కోరుతున్నారు. సహాయం చేయదలచిన దాతలు 9182048507, 8500974223 నంబర్లను సంప్రదించాలని కుటుంబ సభ్యులు విజ్ఞప్తి చేశారు.

epaper.penpower.in | 2026-09-25 | Page: 6
For more details, visit epaper.penpower.in




## భారీ వర్షాలకు కోతకు గురైన కల్వర్టు, రహదారి



- మరమ్మత్తులు చేపట్టాలని గ్రామస్తుల డిమాండ్
- బుంగ పుట్టు పంచాయితీ మాజీ ఉప సర్పంచ్ కొర్ర సీతారాం.

**ముంచంగిపుట్టు, పెన్ పవర్, సెప్టెంబర్ 26.** మండలంలో గల బుంగపుట్టు పంచాయితీ, గరం గ్రామం నుండి సిరగంపుట్టు వెళ్లే రహదారిలో ఉన్న కల్వర్టు భారీ వర్షాలకు కొట్టుకుపోయిందని, కల్వర్టుతో పాటు రహదారి మరమ్మతులు చేపట్టాలని బుంగపుట్టు పంచాయితీ మాజీ ఉప సర్పంచ్ కొర్ర సీతారం ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. గ్రామంలో 30 కుటుంబాలు నివసిస్తున్నారని, సరైన రహదారి లేకపోవడం వల్ల గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ప్రభుత్వము తక్షణమే స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరారు.

## జీవీఎంసీ 89,91వ వార్డులకు కార్పొరేటర్ ఎన్నికలకు పోటీకి సిద్ధం - సింగూరి అనంత్




**గాజువాక, పెన్ పవర్, సెప్టెంబర్ 26:** జీవీఎంసీ 89,91వ వార్డులకు కార్పొరేటర్‌గా తెలుగుదేశం పార్టీ నుంచి పోటీ చేసేందుకు తనకు టికెట్ కేటాయించాలని ప్రస్తుత కొత్త 89వ వార్డు, మరియు పాత 73వ వార్డు తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు సింగూరి అనంత్ గాజువాక శాసనసభ్యులు పల్లా శ్రీనివాసరావు కి వినతి పత్రం అందజేశారు... ఈ సందర్భంగా అనంత్ మాట్లాడుతూ..పార్టీ ఆవిర్భావం నుంచి వార్డు ప్రజా సమస్యలపై పనిచేస్తూ, స్థానిక ప్రజలను చైతన్య పరుస్తూ ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నానని ఆయన తెలిపారు. ప్రతిపక్షంలో ప్రజల తరఫున పలు కార్యక్రమాలు చేపట్టడంతో పాటు, స్థానిక సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేశానన్నారు .కార్పొరేటర్ టికెట్ తనకు కేటాయిస్తే ప్రజల ఆశీస్సులతో విజయం సాధించి చూపిస్తానని ఆయన ధీమా వ్యక్తం చేశారు. అవకాశం కల్పిస్తే వార్డు అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారమే ప్రధాన అజెండాగా ముందుకు సాగుతానని తెలిపారు. కార్యక్రమంలో వార్డు కార్యవర్గ సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

# కాంట్రాక్టర్లకు కాసులు వర్షం... అధికారులకి కమిషన్లు...!





- కొయ్యూరు మండలం విద్యుత్ శాఖ అధికారుల తీరు ?
- బాలారం తాజా మాజీ సర్పంచ్ "అప్పన అప్పలనర్స"

**కొయ్యూరు, పెన్ పవర్ సెప్టెంబర్ 25:** కొయ్యూరు మండలంలో విద్యుత్ శాఖ అధికారుల తీరు చూస్తుంటే ఆశ్చర్యం కలిగిస్తుందని అవసరం ఉన్న చోట కాకుండా ఎలక్ట్రికల్ కాంట్రాక్టురుకు కాసులు కురిపించే విదంగా నిర్ణయాలు తీసుకుంటున్నారఅని బాలారం తాజా మాజీ సర్పంచ్ విమర్శించారు. శుక్రవారం స్థానిక విలేకరులకు విడుదల చేసిన ప్రకటనలో అప్పల నర్సమాట్లాడుతూ... ప్రజలందరికీ ఎంతో ప్రమాదకరంగా ఉన్న పనులును ఎలక్ట్రికల్ సిబ్బంది దృష్టికి తీసుకువెళ్లిన కనీసం స్పందన లేదు అని తెలిపారు. కొయ్యూరు మండలం లో విద్యుత్ అధికారులు ఒక కాంట్రాక్టురకు అనుకూలంగా ఆ కాంట్రాక్టర్ చెప్పిన పనులు చేయడానికే ముందుకు వస్తున్నారని విమర్శించారు. ఒక విద్యుత్తు స్థంభం మార్చుతే సరిపోయే పరిస్థితిల్లు ఉన్న కాంట్రాక్టర్ కు లాభం సంకుర్చేందుకు నాలుగు, ఐదు విద్యుత్తుస్థంబాలు మార్చుతున్నార అని ఇదే విషయం మండల ఎలక్ట్రికల్ ఏ ఈ ని ప్రశ్నిస్తే ఏమి చేసుకుంటారో చేసుకోండి అన్నట్టు నిర్లక్ష్య సమాధానం ఇస్తున్నాడని ఆరోపించారు. ఒక అధికార పార్టీ తాజా మాజీ సర్పంచ్ కే ఈ విదంగా సమాధానం చెప్పుతే ఇంకా అమాయక ప్రజలకు ప్రతిపక్ష నాయకులకు ఏ విధంగా సమాధానం ఇస్తారో ఆలోచించాలి అని తెలిపారు . దీని పై స్థాయి అధికారుల సహకారం లేకుండా ఆ అధికారి ఆలా మాట్లాడతాడా అని ప్రశ్నయినించారు. విద్యుత్ అధికారులు చిన్న చిన్న పనులకి కూడా ఇస్టిమేషన్ వెయ్యాలి అని కాలయాపన చేసి ప్రజలకి విసుగు తెప్పించి చివరకు ప్రజల నుండి వేలల్లో డబ్బులు వసూళ్లు చేసుకుంటున్నారు అని విమర్శించారు. గతంలో ఇదే విదంగా అధికారుల తీరు పై పత్రికలో ప్రకటన ఇస్తే తుతు మంత్రంగా పనులు చేసి మమ అనిపించార అని. అన్నారు. మరల ఇప్పటి వరకు వాళ్ళ జాడే లేదు అని తెలిపారు. అదేవిధంగా ఇంటి సమీపంలో నుండి విద్యుత్ వైర్లు వెళ్లడంతో ఇంటి నిర్మాణాలకు కూడా నిలిచిపోయాయని తెలియజేశారు. ఇప్పటికైనా ఉన్నత అధికారులు ఈ విషయం పై దృష్టి సారించి చర్యలు తీసుకోకపోతే మండల అధికారులు చెప్పునట్టు ఏమి చెయ్యాలో అదే చేస్తాం అని తెలిపారు.

# ప్రజా సేవే మా లక్ష్యం - విద్యుత్ శాఖ

- ప్రాణాలను తెగించి విధి నిర్వహణ?లో పాల్గొన్న సిబ్బంది.
- ఎడతెరిపి లేని వర్షాల్లో విద్యుత్ అంతరాయం ఏర్పడకుండా విధులు నిర్వహణ.
- తీవ్ర వాయుగుండం ప్రభావాన్ని ఎదురొడ్డి నిలిచిన విద్యుత్ శాఖ సిబ్బందికి పలువురు ప్రశంసాలు.
- ప్రజాసేవే లక్ష్యమన్న ముంచంగిపుట్టు లైన్ ఇన్స్పెక్టర్ గణేష్.



**ముంచంగిపుట్టు, పెన్ పవర్, సెప్టెంబరు 26.** బంగాళాఖాతంలో ఏర్పడ్డ తీవ్ర వాయుగుండం ప్రభావంతో ఏజెన్సీ వ్యాప్తంగా కురిసిన భారీ వర్షాలు, వరదల సమయంలో ప్రాణాలను సైతం లెక్కచేయకుండా ప్రజలకు వెలుగును అందించేందుకు శ్రమించిన విద్యుత్ శాఖ సిబ్బంది పట్ల సర్వత్రా ప్రశంసలు వ్యక్తమవుతున్నాయి. ఇటీవల సంభవించిన ప్రకృతి వైపరీత్యాల వేళ ప్రజాసేవే లక్ష్యంగా విద్యుత్ పునరుద్ధరణ పనుల్లో వారు చూపిన ప్రతిభ, సామాజిక బాధ్యత శ్లాఘనీయం. ఎడతెరిపి లేని వర్షాల్లో విద్యుత్ అంతరాయం ఏర్పడకుండా ప్రాణాలకు తెగించి విధి నిర్వహణలో భాగంగా వరద నీటిలో మునిగిపోయిన ప్రదేశాలు, గ్రామాలకు వెళ్లి విద్యుత్ స్తంభాలు, తీగేలను విద్యుత్ సిబ్బంది పునరుద్ధరించారు. ఈదురుగాలులు, వర్షాల వల్ల విరిగిపడిన చెట్లను, తెగిపడిన కరెంట్ తీగలను తొలగించి గంటల వ్యవధిలోనే యుద్ధ ప్రతిపాదికన విద్యుత్ సరఫరాను సాధారణ స్థితికి తెచ్చారు. శనివారం ముంచంగిపుట్టు మండలానికి చెందిన లైన్ ఇన్స్పెక్టర్ గణేష్ మాట్లాడుతూ..సైక్లోన్ ప్రభావంతో మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా భారీ వర్షాలు కురిసినప్పటికీ, ముంచంగిపుట్టు సబ్‌స్టేషన్ పరిధిలోని 23 పంచాయతీలకు చెందిన గ్రామాల్లో విద్యుత్ సరఫరాను సాధ్యమైనంత నిరంతరంగా కొనసాగించేందుకు విద్యుత్ శాఖ సిబ్బంది అహర్నిశలు కృషి చేశారన్నారు. వర్షాన్ని సైతం లెక్కచేయకుండా, ప్రాణాలను సైతం పణంగా పెట్టి లైన్మెన్లు, ఆపరేటర్లు మరియు ఇతర సిబ్బంది క్షేత్రస్థాయిలో నిరంతరం పనిచేస్తూ, ఫెయిల్యూర్ అయిన డిటిఆర్ లను పునరుద్ధరించడం, లైన్ సమస్యలను గుర్తించి పరిష్కరించడం, విద్యుత్ అంతరాయాలను వీలైనంత త్వరగా తొలగించడం వంటి సేవలను అందించామన్నారు. ఈ సందర్భంగా మూడు రోజుల వర్షాల్లో విద్యుత్ శాఖ సిబ్బంది చేసిన సేవలను వీడియోలు, ఫోటోలు విడుదల చేశారు. ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు విద్యుత్ శాఖ సిద్ధంగా ఉందని, ప్రజలకు నిరంతర నాణ్యమైన విద్యుత్ సేవలు అందించేందుకు విద్యుత్ శాఖ ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటుందని ఎల్ఐ పేర్కొన్నారు.

## పదవి ముగిసినా.. ప్రజాసేవ కొనసాగుతుంది

- ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకునేందుకు కృషి చేశా
- మాజీ వైస్ ఎంపీపీ సప్పగెడ్డ ఆనంద్



**గూడెంకొత్తవీధి, పెన్ పవర్, సెప్టెంబర్ 26:**పదవులు తాత్కాలికమేనని, ప్రజలతో ఏర్పడిన అనుబంధం మాత్రం ఎప్పటికీ కొనసాగుతుందని గూడెంకొత్తవీధి మండలం మాజీ వైస్ ఎంపీపీ, పెదవలస ఎంపీటీసీ సప్పగెడ్డ ఆనంద్ అన్నారు. పెదవలస గ్రామ పంచాయతీ ప్రజలు తనపై నమ్మకంతో ఎంపీటీసీగా గెలిపించి మండల పరిషత్తుకు పంపించినందుకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. మండల పరిషత్ పాలకవర్గం పదవీకాలం ముగిసిన సందర్భంగా మండల పరిషత్ కార్యాలయంలో తనతో పాటు పదవీకాలం పూర్తి చేసుకున్న ఎంపీటీసీ సభ్యులు, మాజీ సర్పంచులు, అధికారులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, సహకరించిన ప్రతి ఒక్కరికీ పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు.గత ఐదేళ్లలో మండల అభివృద్ధికి ఎంపీటీసీ సభ్యులు అందించిన సహకారం అభినందనీయమన్నారు. ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ గ్రామాల అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఎంపీటీసీలు చేసిన కృషి ప్రశంసనీయమని పేర్కొన్నారు. పదవీకాలం పూర్తయినప్పటికీ ప్రజాసేవకు దూరం కాకుండా నిరంతరం ప్రజల మధ్య ఉండాలని ఆకాంక్షించారు."అధికారం తాత్కాలికం.. కానీ ప్రజల అభిమానం, మనం చేసిన సేవలు శాశ్వతం. ఐదేళ్ల పదవీకాలంలో మండల అభివృద్ధికి చేసిన సేవలు ఎప్పటికీ గుర్తుండిపోతాయి. పదవీకాలాన్ని విజయవంతంగా పూర్తి చేసుకున్న ఎంపీటీసీ సభ్యులందరికీ హృదయపూర్వక అభినందనలు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు అధిష్ఠించాలని కోరుకుంటున్నాను" అని ఆనంద్ తెలిపారు.పెదవలస పంచాయతీ ప్రజలు తనకు కల్పించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తన పరిధిలో ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేశానన్నారు. ఈ క్రమంలో తనకు అండగా నిలిచిన పంచాయతీ పెద్దలు, కార్యకర్తలు, ప్రజలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.భవిష్యత్తులో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు తమ హక్కులు, చట్టాలు, రిజర్వేషన్లపై అవగాహన పెంచుకుని, పంచాయతీ సమస్యల పరిష్కారం కోసం నిలబడే వ్యక్తులను ఎన్నుకోవాలని సప్పగెడ్డ ఆనంద్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

## పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలి

- మధ్యాహ్నం భోజన కార్మికుల ధర్నా




**నర్సీపట్నం, పెన్ పవర్ (సెప్టెంబర్) :** మధ్యాహ్న భోజన పథకంలో కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఏపీ మధ్యాహ్న భోజన పథకం కార్మిక సంఘం సీఐటీయూ ఆధ్వర్యంలో శనివారం ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ 2026 జూన్ నెల నుంచి సుమారు నాలుగు నెలలుగా మెనూ చార్జీలు, పారితోషకాలు చెల్లించకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తెలిపారు. ప్రస్తుతం ప్రభుత్వం అందిస్తున్న మెనూ చార్జీలు 1 నుంచి 5వ తరగతి విద్యార్థులకు రోజుకు రూ.6.19, 6 నుంచి 12వ తరగతి విద్యార్థులకు రోజుకు రూ.9.29 మాత్రమే ఉండటంతో, పెరుగుతున్న నిత్యావసర ధరలకు అవి ఏమాత్రం సరిపోవడం లేదని పేర్కొన్నారు.
అదేవిధంగా బిల్లులు నెలల తరబడి పెండింగ్‌లో ఉండటంతో పాఠశాలల్లో మిడ్‌డే మీల్ నిర్వహణకు అవసరమైన సరుకులను వ్యాపారుల వద్ద అరువుగా కూడా తీసుకురాలేని పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే పెండింగ్‌లో ఉన్న మెనూ చార్జీలు, పారితోషకాలను విడుదల చేయడంతో పాటు మెనూ చార్జీలను పెంచాలని ఏపీ మధ్యాహ్న భోజన పథకం కార్మిక సంఘం డిమాండ్ చేసింది. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా నాయకులు కె. ప్రసన్న, మండల అధ్యక్షుడు ఓమ్మి నూకరాజు, రుత్తల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## ములగల మెట్ట, రాజేంద్రపాలెం లో వైభవంగా అన్న సమరాధన..!

వేలాదిగా తరలివచ్చిన భక్తులు



**కొయ్యూరు, పెన్ పవర్ సెప్టెంబర్ 26:** బొజ్జ గణపయ్య అన్న సమారాధన కార్యక్రమం మొలగల మెట్ట, రాజేంద్రపాలెం లో అత్యంత వైభవంగా ఆలయ కమిటీ నిర్వహిలు చేపట్టారు. మండలంలో కినపర్తి పంచాయతీ ములగల మెట్టలో, అలాగే రాజేంద్రపాలెం గర్భగుడిలో ప్రతి ఏడాది గణనాథుడు ప్రతిష్ట ఎంతో ఆహ్లాదకరంగా అత్యంత వైభవంగా చేపడుతూ ఉంటారు. గణనాథుడిని ప్రతిష్టించిన రోజు నుండి ప్రతిరోజు భజన కార్యక్రమాలు వివిధ కోలాటాలు వంటివి నిర్వహిస్తూ ఉంటారు. అలాగే ప్రతి ఏడాది నిర్వహించే మాదిరిగానే శనివారం అన్న సమరాధనా కార్యక్రమం ఈ ప్రాంతంలో ఎక్కడా జరగని రీతిలో నిర్వహించారు. ఈ అన్న సమరాధనా కార్యక్రమానికి గొలుగొండ, కొయ్యూరు మండలాల నుండి వేలాదిగా భక్తుల తరలివచ్చి స్వామివారి ప్రసాదాన్ని స్వీకరించారు. ఇదే రీతిలో శనివారం బొజ్జ గణపయ్యను మేల తాళాలతో, డప్పు వాయిద్యాలు , మందు గుండి సామాగ్రి, గిరిజన సాంప్రదాయ నృత్యాలతో అత్యంత వైభవంగా ఊరేగింపు కార్యక్రమం కూడా చేపడతామని నిర్వాహకులు తెలియజేశారు. ఈ నిమజ్జనం కార్యక్రమంలో సమీపంలో ఉన్న వివిధ గ్రామాలు ప్రజలందరూ తరలివచ్చి పాల్గొవాలని వారు ఈ సందర్భంగా కోరారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులువిలేజ్ కమిటీ యూత్ సభ్యులు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు

# వర్ష బాధితులకు వైఎస్సార్‌సీపీ నేతల అండ

పలు గ్రామాల్లో పర్యటించి నిత్యావసర సరుకుల పంపిణీ



**గూడెం కొత్తవీధి, పెన్ పవర్, సెప్టెంబర్ 26:**గత మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా ఆస్తి, పంట నష్టాలకు గురైన బాధిత కుటుంబాలను పరామర్శించి వారికి అండగా నిలిచేందుకు వైఎస్సార్‌సీపీ నాయకులు శనివారం గూడెంకొత్తవీధి మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించారు.పాడేరు ఎమ్మెల్యే, అల్లూరి జిల్లా పార్టీ అధ్యక్షులు మత్స్యరాస విశ్వేశ్వర రాజు ఆదేశాల మేరకు, జీకే వీధి మండల పార్టీ అధ్యక్షులు కంకిపాటి గిరిప్రసాద్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. గూడెం పంచాయతీ పరిధిలోని ఆర్‌వీ నగర్, వంచుల పంచాయతీ సిరిబాల, మొండిగెడ్డ పంచాయతీ కొత్తవాడ, కొండపల్లిపాడు, గింజంగి, జర్రెల పంచాయతీ జర్రెల కొత్తూరు, రింతాడ పంచాయతీ పనసలొద్ది గ్రామాల్లో పర్యటించిన నాయకులు వర్ష బాధిత కుటుంబాలకు పార్టీ తరఫున నిత్యావసర సరుకులను అందజేశారు.ఈ సందర్భంగా బాధిత కుటుంబాలను పరామర్శించి, అధైర్యపడవద్దని భరోసా కల్పించారు. భారీ వర్షాల కారణంగా వంచుల, జర్రెల, మొండిగెడ్డ పంచాయతీల పరిధిలో పలు కల్వర్టులు, వంతెనలు కొట్టుకుపోయి రాకపోకలకు అంతరాయం ఏర్పడిన విషయాన్ని నాయకులు పరిశీలించారు.వర్షాలు, వరదల కారణంగా గ్రామాల్లో నెలకొన్న పరిస్థితులను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి బాధితులకు మెరుగైన సహాయం అందేలా చర్యలు తీసుకుంటామని నాయకులు తెలిపారు. ఈ సమస్యలను పాడేరు ఎమ్మెల్యే, జిల్లా పార్టీ అధ్యక్షులు మత్స్యరాస విశ్వేశ్వర రాజు, అరకు పార్లమెంట్ సభ్యురాలు గుమ్మా తనూజ రాణి దృష్టికి తీసుకెళ్లి, ప్రభుత్వ అధికారులతో మాట్లాడేలా చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ బోయిన కుమారి, మాజీ ఎంపీటీసీ కొర్ర రాజులమ్మ, మొండిగెడ్డ మాజీ సర్పంచ్ అడపా ప్రియాంక, రాష్ట్ర పంచాయతీరాజ్ విభాగం కార్యదర్శి బొబ్బిలి లక్ష్మణ్, మండల ఉపాధ్యక్షులు వంతల అరుణ్‌కుమార్, రీమల బాలకృష్ణ, మండల ప్రధాన కార్యదర్శులు వంతల చంటిబాబు, నియోజకవర్గ అధ్యక్షులు వనపల రాజేష్, ముువ్వల చిన్నబ్బాయి, మండల ఎస్టీ సెల్ అధ్యక్షులు కంకిపాటి నారాయణ, మండల కార్యదర్శి వంతల రాజారావు, మండల కార్యవర్గ సభ్యులు జర్త బాలన్న, పంచాయతీ పార్టీ అధ్యక్షులు సోబోయి రామూర్తి, కొర్ర నూకరాజు, కరణం గోపాల్ కృష్ణ, మాజీ సూపర్ ఎంపీపీ బోయిన వెంకట్, వంచుల మాజీ ఉపసర్పంచ్ చల్లంగి శ్రీధర్, సీనియర్ నాయకులు పిండి రామకృష్ణ, అరికట్ల ఆంజనేయులు, రాజారావు, దారకాని మోహన్, నూతన్, కొర్ర లింగేష్ తదితరులు పాల్గొన్నారు.

## 11 వ వార్డులో ఘనంగా ముగిసిన వరసిద్ధి వినాయక మహోత్సవాలు



**విశాఖ తూర్పు,పెన్ పవర్, సెప్టెంబర్ 26:**జీవీఎంసీ పరిధిలోని 11వ వార్డు పాత అరిలోవ శ్రీ వరసిద్ధి వినాయక నవరాత్రి మహోత్సవాలు ఘనంగా ముగిశాయి.ముగింపు వేడుకల్లో భాగంగా నిర్వాహకులు భారీ అన్న సమారాధన కార్యక్రమాలు నిర్వహించారు.ఈ కార్యక్రమాలకు ముఖ్య అతిథిగా విశాఖ తూర్పు నియోజకవర్గ టీడీపీ నాయకులు వెలగపూడి ప్రతాప్ రుద్ర పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి, తీర్థప్రసాదాలు స్వీకరించిన అనంతరం అన్న సమారాధన కార్యక్రమాన్ని ప్రారంభించారు.
ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వినాయక నవరాత్రి ఉత్సవాలు ప్రజల్లో భక్తితో పాటు సేవాభావాన్ని, ఐక్యతను పెంపొందిస్తాయని, వినాయకుని ఆశీస్సులతో ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సిరిసంపదలతో ఉండాలని ఆకాంక్షించారు.
ఈ కార్యక్రమాల్లో 11వ వార్డు అధ్యక్షులు ముగడ రాజారావు, నాయకులు కాకి గంగరాజు, మూది అప్పారావు, కృష్ణంరాజు,సంపంగి కాశి తదితరులు పాల్గొన్నారు.

## వర్ష బీభత్సంతో విలవిల.. దెబ్బతిన్న వంతెనలు, రహదారుల పరిశీలన

జనసేన నేత గొర్లె వీర వెంకట్ పరిశీలన



**గూడెంకొత్తవీధి, పెన్ పవర్, సెప్టెంబర్ 26:**అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెంకొత్తవీధి మండలంలోని దారకొండ, దుప్పులవాడ పంచాయతీల పరిధిలో భారీ వర్షాలకు దెబ్బతిన్న వంతెనలు, రహదారులను అరకు పార్లమెంట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్, జనసేన పార్టీ నాయకుడు గొర్లె వీర వెంకట్ శనివారం పరిశీలించారు.భారీ వర్షాలు, వరదల కారణంగా అగ్రహారం, చిన్న గంగవరం, పెద్ద గంగవరం తదితర గ్రామాల్లో రహదారులు, వంతెనలు దెబ్బతినడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడిన పరిస్థితిని ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. వరదల కారణంగా ఇళ్లు, పంటలు నష్టపోయిన బాధితులను పరామర్శించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.రవాణా సౌకర్యాలు దెబ్బతినడంతో అత్యవసర వైద్య సేవలు పొందేందుకు ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను స్థానికులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ముఖ్యంగా ప్రసవ సమయం సమీపించిన మహిళలను ఆసుపత్రులకు తరలించడంలో ఎదురవుతున్న సమస్యలపై ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. బాధితులకు అవసరమైన వైద్య సహాయం అందేలా సంబంధిత అధికారుల దృష్టికి సమస్యలను తీసుకెళ్తామని తెలిపారు.అలాగే వరద నీటిలో మునిగిపోయిన పంట పొలాలను పరిశీలించిన వీర వెంకట్, చేతికొచ్చే దశలో ఉన్న వరి పంటలు దెబ్బతినడంతో రైతులు ఎదుర్కొంటున్న నష్టాలను తెలుసుకున్నారు. పంట నష్టాల వివరాలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి, నష్టపోయిన రైతులకు తగిన పరిహారం అందేలా కృషి చేస్తామని భరోసా ఇచ్చారు.ఈ సందర్భంగా కూటమి నాయకులు, జనసేన కార్యకర్తలు, స్థానిక ప్రజలు వీర వెంకట్‌కు స్వాగతం పలికి తమ సమస్యలను వివరించారు. దెబ్బతిన్న రహదారులు, వంతెనల పునరుద్ధరణకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు కొయ్యం ఇమ్మానియేల్, గడుతూరి పరమేష్, దాసు, కొర్ర రాంబాబు, గొర్లె సరస్వతి రావు,బాబురావు, కోటేశ్వరరావు, టోక్కు బాబు తదితరులు పాల్గొన్నారు.

# శ్రమదానంతో రహదారి మరమ్మతులు

అధికారుల కోసం ఎదురుచూడకుండా రోడ్డు బాగు చేసుకున్న గిరిజనులు



**గూడెంకొత్తవీధి, పెన్ పవర్, సెప్టెంబర్ 26:**గూడెంకొత్తవీధి మండలంలో గత ఐదు రోజులుగా కురిసిన భారీ వర్షాలకు పలు గ్రామాల్లో రహదారులు దెబ్బతిన్నాయి. వంచుల పంచాయతీ పరిధిలోని అరగడాపల్లి మెటల్ రహదారి సైతం భారీ వర్షాలకు పూర్తిగా దెబ్బతిని, పలుచోట్ల పెద్ద గోతులు ఏర్పడ్డాయి. రహదారి దెబ్బతినడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్న నేపథ్యంలో గ్రామస్థులు సమస్యను తామే పరిష్కరించుకోవాలని నిర్ణయించారు. వర్షం కాస్త తగ్గుముఖం పట్టడంతో శనివారం ఉదయం గ్రామానికి చెందిన గిరిజనులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి శ్రమదానం చేపట్టారు.అందరూ కలిసి రహదారిపై ఏర్పడిన గోతులను పూడ్చి, రాకపోకలకు వీలుగా రహదారిని తాత్కాలికంగా బాగు చేసుకున్నారు. తమ సమస్యను తామే పరిష్కరించుకునేందుకు గ్రామస్థులు ఐక్యంగా చేపట్టిన ఈ శ్రమదానం స్థానికంగా పలువురి ప్రశంసలు అందుకుంది.అయితే భారీ వర్షాలకు రహదారి పూర్తిగా దెబ్బతిన్నందున అధికారులు స్పందించి శాశ్వత మరమ్మతులు చేపట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు.

## చేనులోనే కుప్పకూలి యువకుడి మృతి

తల్లిదండ్రుల కళ్ల ముందే విషాద ఘటన



**గూడెంకొత్తవీధి, పెన్ పవర్, సెప్టెంబర్ 26:** తల్లిదండ్రులతో కలిసి వ్యవసాయ పనులకు వెళ్లిన ఓ యువకుడు అకస్మాత్తుగా అస్వస్థతకు గురై మృతి చెందిన విషాద ఘటన గూడెంకొత్తవీధి మండలంలోని రింతాడ పంచాయతీ ఊబలు గ్రామంలో శనివారం చోటుచేసుకుంది.స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఊబలు గ్రామానికి చెందిన కోర్ర లక్ష్మి, బాలన్న దంపతుల పెద్ద కుమారుడు సునీల్‌కుమార్ (24) శనివారం ఉదయం తల్లిదండ్రులతో కలిసి చేనులో వ్యవసాయ పనులకు వెళ్లాడు. అందరూ కలిసి పనులు చేసుకుంటుండగా సునీల్‌కుమార్‌కు అకస్మాత్తుగా తీవ్రమైన గుండెనొప్పి రావడంతో అక్కడికక్కడే కుప్పకూలిపోయాడు.దీంతో ఆందోళనకు గురైన తల్లిదండ్రులు వెంటనే అతడిని ఇంటికి తరలించారు. అయితే అప్పటికే సునీల్‌కుమార్ మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు గుర్తించారు. కళ్ల ముందే కుమారుడు మృతి చెందడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపించారు.ఈ ఘటనతో ఊబలు గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి. చిన్న వయసులోనే సునీల్‌కుమార్ మృతి చెందడంతో కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్థులు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు.

## జీకేవీధిలో 28న ప్రజా సమస్యల పరిష్కార వేదిక



**గూడెంకొత్తవీధి, పెన్ పవర్, సెప్టెంబర్ 26:**ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 28న గూడెంకొత్తవీధి మండల కేంద్రంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీవో బి.హెచ్.వి. రమణబాబు తెలిపారు.శనివారం ఆయన మాట్లాడుతూ.. కార్యక్రమంలో ప్రజల నుంచి వివిధ సమస్యలపై వినతులు స్వీకరించి, వాటి పరిష్కారానికి సంబంధిత శాఖల అధికారులతో చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రజలు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

## ఈ నెల 28న పాడేరు ఎమ్మెల్యే రాక...!

- వైయస్సార్సీపి ఐడి కార్డులు అందజేత...
- విధిగా వైఎస్సార్సీపీ నాయకులు హాజరు కావాలని పార్టీ మండల అధ్యక్షుడు బిడిజన పిలుపు



**కొయ్యూరు, పెన్ పవర్ సెప్టెంబర్ 26:** మండల కేంద్రంలోని గిరిజన భవనం వద్దవైఎస్సార్సీపీ ఐడీ కార్డుల పంపిణీ కార్యక్రమం పాల్గొననున్న లిపాడేరు ఎమ్మెల్యే, జిల్లా ఇన్‌ఛార్జ్ మత్స్యరాస విశ్వేశ్వర రాజు.
ఈ నెల 28న కొయ్యూరు (మండల కేంద్రం)లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వర్యులు వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు, ఆయన ఆశయ సాధన కోసం స్థానిక సంస్థలలో పార్టీ బలోపేతమే లక్ష్యంగా కొయ్యూరు మండల కేంద్రం గిరిజన భవనం దగ్గరలో ఈ నెల 28న (సోమవారం) ఉదయం 11:00 గంటలకు వైఎస్సార్సీపీ ఐడీ కార్డుల పంపిణీ కార్యక్రమం ఘనంగా జరగనుంది. ఈ కార్యక్రమానికి పాడేరు శాసనసభ్యులు (ఎమ్మెల్యే), జిల్లా ఇన్‌ఛార్జ్ మత్స్యరాస విశ్వేశ్వర రాజు ముఖ్య అతిథిగా హాజరై, తమ చేతుల మీదుగా పార్టీ శ్రేణులకు ఐడీ కార్డులను అందజేయనున్నారు. జగనన్న నాయకత్వంలో పార్టీని మరింత పటిష్టం చేసేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతుందని వైసిపి కొయ్యూరు మండల పార్టీ అధ్యక్షులు బిడిజన అప్పారావు పిలుపునిచ్చారు. మండల పరిధిలోని 33 పంచాయతీల నుండి రాష్ట్ర, జిల్లా, మండల, రాష్ట్ర మహిళా విభాగం, పంచాయితీ స్థాయి నాయకులు, మాజీ ఎంపీపీ, వైస్ ఎంపీపీలు, మాజీ సర్పంచ్‌లు, మాజీ ఎంపీటీసీలు, మాజీ వాలంటీర్లు, గృహ సారథులు, గ్రామ పంచాయితీల అన్ని విభాగాల సభ్యులు, పంచాయితీ సీనియర్ నాయకులు, పార్టీ కార్యకర్తలు మరియు వైయస్సార్ అభిమానులు భారీ సంఖ్యలో తరలివచ్చి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాల్సిందిగా బిడిజన అప్పారావు కోరారు.

# ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలి...!






✸ ప్రజాస్వామ్యాన్ని గెలిపించాలి డి ఎల్ పి ఓ కుమార్ పిలుపు

**కొయ్యూరు, పెన్ పవర్ సెప్టెంబర్ 26:** 18 సంవత్సరాలు నిండినవాళ్లు ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని మండల స్పెషల్ ఆఫీసర్ డిఎల్పిఓ కుమార్ పిలుపునిచ్చారు. శనివారం మర్రిపాలెం డిగ్రీ కళాశాలలోఓటర్ల నమోదు మరియు ఓటు హక్కు వినియోగంపైద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పి.ఎస్. కుమార్ మాట్లాడుతూ... కళాశాలలోని సుమారు 300 మంది డిగ్రీ విద్యార్థినులకు ఓటు హక్కు ప్రాధాన్యత, ప్రజాస్వామ్యంలో ఎన్నికల భాగస్వామ్యం గురించి అవగాహన కల్పించారు. 18 సంవత్సరాలు పూర్తయిన అర్హులైన ప్రతి విద్యార్థిని ఫారం--6 ద్వారా ఓటరుగా నమోదు చేసుకుని, ఈ పి ఐ సి కార్డు పొందాలని సూచించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో అర్హులైన ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును బాధ్యతగా వినియోగించాలని తెలిపారు."ఓటు మన హక్కు మాత్రమే కాదు.. ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేసే బాధ్యత కూడా. సరైన వ్యక్తిని ఎన్నుకునేందుకు ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును తప్పనిసరిగా వినియోగించాలి" అని కుమార్ విద్యార్థినులకు సూచించారు.కళాశాలలో అర్హులైన విద్యార్థినులందరూ ఓటరుగా నమోదు అయ్యేలా స్థానిక బి ఎల్ ఓ , వీఆర్వో లు ప్రత్యేక దృష్టి సారించి 100 శాతం ఓటరు నమోదు పూర్తి చేయాలని ఆయన ఆదేశించారు. తహసీల్దార్ కె. ప్రసాదరావు మాట్లాడుతూ... విద్యార్థుల్లో ఎన్నికలు, ఓటు హక్కుపై అవగాహన పెంపొందించేందుకు కళాశాలలో లిటరసీ క్లబ్ ఏర్పాటు చేసి, ఓటరు నమోదుకు విద్యార్థులను ప్రోత్సహించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీవో జీడివి ప్రసాదరావు, కళాశాల ప్రిన్సిపాల్ సుధా,కామర్స్ లెక్చరర్ శేఖర్, బి ఎల్ వో లు విఆర్వోలు మరియు కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

## బాధితులను ఆదుకోవడంలో కూటమి సర్కారు విఫలం.

✸ ప్రభుత్వానిది ఉదాసీనతా.. అధికారుల నిర్లక్ష్యమా?

✸ వైఎస్సార్‌సీపీ గ్రీవెన్స్ వింగ్ రాష్ట్ర కార్యదర్శి పోతురాజు బాలయ్య.




**చింతపల్లి పెన్ పవర్ సెప్టెంబర్ 26.** తుపాను బాధితులను ఆదుకోవడంలో కూటమి ప్రభుత్వం, అధికారుల తీరుపై రాష్ట్ర వైఎస్సార్‌సీపీ గ్రీవెన్స్ వింగ్ కార్యదర్శి, చింతపల్లి మాజీ జెడ్పీటీసీ పోతురాజు బాలయ్య తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. విపత్తు సమయంలో సర్వం కోల్పోయి ప్రజలు అల్లాడుతుంటే కనీస సాయం అందకపోవడం ప్రభుత్వ ఉదాసీనతా? లేక అధికారుల నిర్లక్ష్యమా? అని ఆయన నిలదీశారు. స్థానిక విలేకరులతో మాట్లాడిన ఆయన ప్రభుత్వ తీరును తీవ్రంగా తప్పుబట్టారు. తమ వైకాపా ప్రభుత్వ హయాంలో విపత్తులు సంభవించినప్పుడు అప్పటి ముఖ్యమంత్రి తక్షణమే స్పందించేవారని బాలయ్య గుర్తుచేశారు. అధికారులను అప్రమత్తం చేసి, బాధితులకు వెంటనే సాయం అందేలా చర్యలు తీసుకునేవారన్నారు. ఇళ్లు, ఆస్తులు కోల్పోయి రోడ్డున పడిన వారికి పౌరసరఫరాల శాఖ ద్వారా యుద్ధప్రాతిపదికన నిత్యావసర సరుకులు పంపిణీ చేసేవారన్నారు. కానీ, ప్రస్తుత కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక.. రోజులు గడుస్తున్నా బాధితుల వైపు కన్నెత్తి చూసిన పాపాన పోలేదని దుయ్యబట్టారు. గతంలో విపత్తులు వచ్చినప్పుడు జిల్లా కలెక్టర్లు క్షేత్రస్థాయి అధికారులను ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకుంటూ బాధితులకు అండగా నిలిచేవారని బాలయ్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇళ్లు దెబ్బతిన్న బాధితులకు అప్పట్లో తక్షణ సాయం కింద రూ. 25 వేలు అందించేవారని, ప్రస్తుత కలెక్టర్ మాత్రం బాధితులకు సాయం చేయడంలో పూర్తిగా విఫలమయ్యారని విమర్శించారు. ఇప్పటికైనా జిల్లా యంత్రాంగం నిద్రమత్తు వీడి తక్షణమే స్పందించాలని ఆయన డిమాండ్ చేశారు. తుపాను బాధిత కుటుంబాలకు తక్షణ సాయం కింద కనీసం నిత్యావసర సరుకులైనా పంపిణీ చేసి వారిని ఆదుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

## శిథిల పాఠశాల భవనాల కూల్చివేతకు శ్రీకారం

✸ తొలి విడతలో మూడు పాఠశాల భవనాలు తొలగింపు



**గూడెంకొత్తవీధి, పెన్ పవర్, సెప్టెంబర్ 26:** గూడెంకొత్తవీధి మండలంలో శిథిలావస్థకు చేరిన ప్రాథమిక పాఠశాల భవనాల కూల్చివేతకు అధికారులు శ్రీకారం చుట్టారు. విద్యార్థులు, ఉపాధ్యాయులకు ప్రమాదం పొంచి ఉండటంతో మండలంలో శిథిల భవనాలపై అధికారులు సర్వే నిర్వహించారు. మొత్తం 21 పాఠశాల భవనాలు శిథిలావస్థలో ఉన్నట్లు గుర్తించి జిల్లా అధికారులకు నివేదించారు.జిల్లా కలెక్టర్ అనుమతి మేరకు శనివారం మండలంలోని పనసపల్లి, వీరవరం, వంతాడపల్లి ప్రాథమిక పాఠశాలలకు చెందిన శిథిల భవనాలను అధికారులు కూల్చివేశారు. మండల విద్యాశాఖ, ఇంజినీరింగ్ అధికారుల పర్యవేక్షణలో ఈ ప్రక్రియ చేపట్టారు.ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి–2 కె. రమణ, ఏఈ కొయ్యం బాలరాజు, మొండిగెడ్డ ఇంజినీరింగ్ అసిస్టెంట్ చింతర్ల ప్రశాంత్, వంచుల ఇంజినీరింగ్ అసిస్టెంట్ ఎస్. రమేష్, జర్రెల సీఆర్పీ పీవీఆర్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## కూటమి అభ్యర్థుల విజయానికి సమన్వయంతో కృషి చేయాలి

జనసేన నేత గొర్లె వీర వెంకట్



**గూడెంకొత్తవీధి, పెన్ పవర్, సెప్టెంబర్ 26:** గూడెంకొత్తవీధి మండలంలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ఉమ్మడి కూటమి అభ్యర్థుల విజయానికి జనసేన నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో కృషి చేయాలని జనసేన అరకు పార్లమెంట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ గొర్లె వీర వెంకట్ పిలుపునిచ్చారు.దారకొండలో దారకొండ, దుప్పులవాడ, గుమ్మిరేవుల గ్రామ పంచాయతీలకు చెందిన జనసేన నాయకులు, కార్యకర్తలతో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీ అధిష్టానం ఎవరిని అభ్యర్థిగా ప్రకటించినా, వారి విజయానికి ప్రతి నాయకుడు, కార్యకర్త కలిసికట్టుగా పనిచేయాలని సూచించారు.గ్రూపు రాజకీయాలకు స్వస్తి పలికి పార్టీ నిర్ణయాన్ని గౌరవిస్తూ సమన్వయంతో ముందుకు సాగాలని వీర వెంకట్ కోరారు. మూడు గ్రామ పంచాయతీల పరిధిలో జనసేన, ఉమ్మడి కూటమి అభ్యర్థుల విజయానికి ప్రతి ఒక్కరూ బాధ్యతగా పనిచేయాలని తెలిపారు.ఈ సమావేశంలో సరస్వతిరావు,పాండురాజు, బా బురావు, సన్యాసిరావు, కోటి,కొండబాబు,దాసు, ధనుర్జయ్,మల్లు,రాంబాబు దారకొండ,దుప్పులవాడ, గుమ్మిరేవుల గ్రామ పంచాయతీలకు చెందిన జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సీఈసీ జ్ఞానేశ్ కుమార్ తక్షణమే రాజీనామా చేయాలి.

✸ ఓట్ల గల్లంతు వ్యవహారంపై దేశద్రోహం కేసు నమోదు చేయాలి.

✸ చింతపల్లిలో సీపీఎం, సీపీఐ శ్రేణుల నిరసన.



**చింతపల్లి పెన్ పవర్ సెప్టెంబర్ 26.** రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉండి కేంద్రంలోని అధికార బీజేపీకి కొమ్ముకాస్తున్న ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని వామపక్ష నాయకులు డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా అక్రమంగా ఓట్ల గల్లంతుకు పాల్పడుతున్న ఆయనను వెంటనే విధుల నుంచి తొలగించి, దేశద్రోహం కేసు నమోదు చేయాలని స్పష్టం చేశారు. సీపీఎం, సీపీఐ రాష్ట్ర కమిటీల పిలుపుమేరకు శనివారం చింతపల్లి మండల కేంద్రంలో వామపక్షాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు బోనంగి చిన్నయ్య పడాల్ మాట్లాడుతూ.. సీఈసీ తన ఏకపక్ష నిర్ణయాలతో మొత్తం ఎన్నికల వ్యవస్థకే మచ్చతెస్తున్నారని ధ్వజమెత్తారు. బీహార్‌లో మొదలైన ఓట్ల తొలగింపు ప్రక్రియ ఇప్పుడు దేశవ్యాప్తంగా సాగుతోందని, సుమారు 13 కోట్ల మంది ఓటర్లను జాబితా నుంచి తొలగించి ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నారని మండిపడ్డారు. ఫారం–6 ద్వారా కొత్త ఓటర్ల నమోదు, పాత ఓటర్ల తొలగింపు విషయంలో మిగిలిన ఇద్దరు ఎన్నికల కమిషనర్లు తీవ్ర అభ్యంతరాలు వ్యక్తంచేసినా సీఈసీ కనీసంగా పట్టించుకోలేదని చిన్నయ్య పడాల్ ఆరోపించారు. నెల వ్యవధిలో ఏకంగా 14 సార్లు సహచర కమిషనర్లు తమ అభ్యంతరాలను లేవనెత్తినా వాటిని రికార్డుల్లో కనీసం నమోదు చేయలేదని విమర్శించారు. వారి అభిప్రాయాలకు కనీస విలువ ఇవ్వకుండా, రాజ్యాంగ వ్యవస్థను నిర్వీర్యం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఓట్ల చోరీకి పాల్పడుతున్నందున సీఈసీపై దేశద్రోహం కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ఎన్నికల సంఘం ఏకపక్ష తీరుకు వ్యతిరేకంగా ఈ నెల 26 నుంచి అక్టోబరు 2వ తేదీ గాంధీ జయంతి వరకు వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా నిరంతర ఆందోళనలు చేపట్టనున్నట్లు నాయకులు వెల్లడించారు. ఈ నిరసన కార్యక్రమంలో సీపీఎం మండల కమిటీ సభ్యులు సాగిన చిరంజీవి, మజ్జి రాంబాబు, కిలో సింహాచలం, సీపీఐ నాయకులు పి.చిన్నారావు, మండల కమిటీ సభ్యులు జి.బుజ్జన్న, కె.మల్లేశ్వరరావు, జి.బాలన్న తదితరులు పాల్గొన్నారు.

## వినాయక నవరాత్రి ఉన్న సమారాధనలో పాల్గొన్న ఎమ్మెల్యే వెలగపూడి



**విశాఖ తూర్పు,పెన్ పవర్, సెప్టెంబర్ 26:** శ్రీశ్రీశ్రీ వరసిద్ధి వినాయక నవరాత్రి మహోత్సవాలను పురస్కరించుకొని 12వ వార్డు లీలాసుందరయ్య నగర్‌తోపాటు13వ వార్డు పరిధిలోని వెర్నిదుర్గా నగర్, ఆపరేషన్ కాలనీ, శివాజీ నగర్--1 ప్రాంతాల్లో నిర్వహించిన మహా అన్నసంతర్పణ కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో ఘనంగా జరిగాయి.ఈ కార్యక్రమాలకు విశాఖ తూర్పు నియోజకవర్గ శాసనసభ్యులు శ్రీ వెలగపూడి రామకృష్ణ బాబు గారు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా లీలాసుందరయ్య నగర్‌లో ఎల్లో బాయ్స్ ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన వరాహ నరసింహస్వామి సహిత శ్రీ వరసిద్ధి వినాయకుడిని దర్శించారు.నియోజకవర్గ ప్రజలందరూ సుఖ సంతోషాలు, ఆయురారోగ్యాలతో అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని స్వామివారిని ప్రార్థించారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలు ప్రజల్లో భక్తిభావంతోపాటు ఐక్యత భావంతో వినాయక నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తూ, వేలాది మంది భక్తులకు అన్నప్రసాదం అందిస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులను, ఎల్లో బాయ్స్ యువతను ఆయన ప్రత్యేకంగా అభినందించారు.కార్యక్రమంలో 13వ వార్డు టీడీపీ అధ్యక్షులు ఏడువాక సన్యాసిరావు,12వ వార్డు అధ్యక్షులు మరియు ఇన్‌చార్జ్ ఓమ్మి అప్పలరాజు,విశాఖ పార్లమెంట్ కమిటీ అధికార ప్రతినిధి పాత్రకండ ధర్మారావు,గాడి సత్యం. తురకపూడి బాలస్వామి. కిల్లంశెట్టి శ్రీను,అధ్యక్షురాలు మజ్జి రమణి,కర్రి మణి తదితర నాయకులు, కార్యకర్తలు, ఉత్సవ కమిటీ సభ్యులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ముంపు పొలాలను పరిశీలించిన వ్యవసాయ అధికారి

✸ రైతులకు పంటల సంరక్షణపై సూచనలు



**గూడెంకొత్తవీధి, పెన్ పవర్, సెప్టెంబర్ 26:** ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా మండలంలోని పలు ప్రాంతాల్లో ముంపునకు గురైన వరి, రాజ్మా పంట పొలాలను వ్యవసాయ అధికారి ఎన్. సురేష్ శనివారం పరిశీలించారు. గొందిపల్లి, కొత్తూరు, రింతాడ గ్రామాల్లో పర్యటించి రైతులతో మాట్లాడి పంటల పరిస్థితిని తెలుసుకున్నారు.ప్రస్తుతం మండలంలో సాగులో ఉన్న మొక్కజొన్న, వేరుశనగ, అపరాల వంటి మెట్ట పంటల్లో అధికంగా నీరు నిల్వ ఉంటే పంటలకు నష్టం కలిగే అవకాశం ఉందని తెలిపారు. పొలాల్లో నీరు నిల్వ ఉండకుండా బయటకు వెళ్లేలా చర్యలు తీసుకోవాలని రైతులకు సూచించారు.వరి పంట ప్రస్తుతం పిలకల దశ నుంచి చిరుపొట్ట దశలో ఉన్నందున ముంపు నీటిని వీలైనంత త్వరగా బయటకు పంపించాలని సూచించారు. అనంతరం ఎకరాకు 30 కిలోల యూరియా, 15 కిలోల పొటాష్ వేయాలని తెలిపారు.అలాగే అధిక తేమ కారణంగా వరి పంటలో పాముపొడ తెగులు, బ్యాక్టీరియా ఆకు ఎండు తెగులు, అగ్గి తెగులు వచ్చే అవకాశం ఉందని, రైతులు అప్రమత్తంగా ఉండి సంబంధిత నివారణ చర్యలు చేపట్టాలని వ్యవసాయ అధికారి సూచించారు.ఈ కార్యక్రమంలో వీఏహెచ్ఏ కృష్ణ, వీఏఏ సౌందర్య, రైతులు పాల్గొన్నారు.

## నాతవరం మండలంలో మద్యం షాపుకు దరఖాస్తుల ఆహ్వానం....

✸ 2026--27 సంవత్సరానికి ఒకూూ4 షాపు ఖాళీ.....

✸ అక్టోబర్ 1న రాత్రి 11.59 గంటల వరకు దరఖాస్తుల స్వీకరణ....



**నాతవరం, పెన్ పవర్ (సెప్టెంబర్ 26):** ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ గొలుగొండ పరిధిలోని నాతవరం మండలంలో 2026--27 ఆర్థిక సంవత్సరానికి ప్రభుత్వం మొత్తం 5 ూూ4 మద్యం షాపులను నోటిఫై చేసినట్లు ఎక్సైజ్ అధికారులు తెలిపారు. వీటిలో ఇప్పటికే 4 మద్యం షాపులను రెన్యువల్ చేసుకోగా, మరో ఒకూూ4 మద్యం షాపు ఖాళీగా ఉందని వెల్లడించారు.ఈ ఖాళీగా ఉన్న మద్యం షాపుకు ఆసక్తి ఉన్న అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారులు తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు 2026 అక్టోబర్ 1వ తేదీ రాత్రి 11.59 గంటలలోపు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందని పేర్కొన్నారు.దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు ప్రభుత్వానికి రూ.3 లక్షల చలానాతో పాటు రూ.1,000 ప్రాసెసింగ్ ఫీజు చెల్లించాల్సి ఉంటుందని అధికారులు తెలిపారు. దరఖాస్తులను ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్ విధానంలో సమర్పించవచ్చని వెల్లడించారు.ఖాళీగా ఉన్న ూూ4 మద్యం షాపుకు సంబంధించి దరఖాస్తు ప్రక్రియ, అవసరమైన పత్రాలు, చెల్లింపులు తదితర అంశాలపై అభ్యర్థులకు ఏవైనా సందేహాలు ఉంటే ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్, గొలుగొండను సంప్రదించి పూర్తి వివరాలు తెలుసుకోవచ్చని అధికారులు సూచించారు.అర్హత కలిగిన ఆసక్తిగల అభ్యర్థులు గడువు ముగిసేలోపు దరఖాస్తు చేసుకోవాలని గొలుగొండ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఒక ప్రకటనలో కోరారు.

## భారీ వర్షానికి ఇల్లు కూలి వ్యక్తి మృతి

**గూడమాలిపుట్టు గ్రామానికి చెందిన సూర్య నారాయణ మృతి.**

**ముంచంగిపుట్టు ఎస్సై పి నాని.**



**ముంచంగిపుట్టు, పెన్ పవర్, సెప్టెంబరు 26.** భారీ వర్షానికి ఇల్లు కూలి ఓ వ్యక్తి దుర్మరణం చెందిన ఘటన ముంచంగిపుట్టు మండలం, పెదగూడ పంచాయితీ, గూడమాలిపుట్టు గ్రామంలో చోటు చేసుకుంది. స్థానిక ఎస్సై పి నాని తెలిపిన వివరాల ప్రకారం.. వర్షాల కారణంగా పెంకుటిల్లులో నిద్రిస్తున్న పూజారి సూర్యనారాయణ (56) పై శుక్రవారం రాత్రి 9 గంటల సమయంలో ఇల్లు కూలగా చుట్టుపక్కల వారు వెంటనే ఆయనను వెలికి తీసి ఆసుపత్రికి తరలించే క్రమంలో మార్గమధ్యలోనే సూర్యనారాయణ మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారని కుటుంబ సభ్యులు తెలిపినట్లు ఎస్ఐ పేర్కొన్నారు. కాగా జరిగిన ఘటనపై శనివారం గ్రామంలో పర్యటించి పరిశీలించమని, మృతునికి భార్య ఇద్దరు వివాహిత పిల్లలు ఉన్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు. కుటుంబ పెద్దదిక్కుగా ఉన్నా సూర్యనారాయణ మరణించడంతో కుటుంబం వీధిన పడ్డాయని, ప్రభుత్వం ఆదుకోవాలని స్థానికులు విజ్ఞప్తి చేశారు.

## తుపాను ధాటికి ఇల్లు పూర్తిగా ధ్వంసం

బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని వేడుకోలు



**గూడెంకొత్తవీధి, పెన్ పవర్, సెప్టెంబర్ 26:** ఇటీవల కురిసిన భారీ వర్షాలు, తుపాను ప్రభావంతో గూడెంకొత్తవీధి మండలం వంచుల పంచాయతీ పరిధిలోని కొడిసింగి గ్రామంలో ఓ ఇల్లు పూర్తిగా దెబ్బతింది.గ్రామానికి చెందిన మర్రి పెద్దబి కుటుంబానికి చెందిన ఇల్లు తుపాను ప్రభావంతో తీవ్రంగా దెబ్బతిని నివాసానికి పనికిరాని స్థితికి చేరుకుంది. దీంతో బాధిత కుటుంబం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటోంది.ఇల్లు పూర్తిగా దెబ్బతినడంతో కుటుంబ సభ్యులకు సురక్షిత నివాసం లేక ఇబ్బందులు పడుతున్నారని స్థానికులు తెలిపారు. సంబంధిత అధికారులు గ్రామాన్ని సందర్శించి నష్టాన్ని పరిశీలించి, బాధిత కుటుంబానికి ప్రభుత్వం తరఫున తక్షణ ఆర్థిక సాయం, అవసరమైన పునరావాస సహాయం అందించాలని గ్రామస్థులు కోరుతున్నారు.తుపాను, భారీ వర్షాల కారణంగా నష్టపోయిన కుటుంబాలను అధికారులు గుర్తించి, నష్టపరిహారం అందించేందుకు చర్యలు తీసుకోవాలని స్థానికులు విజ్ఞప్తి చేశారు.

# సురక్షిత ప్రసవమే ప్రభుత్వ లక్ష్యం

- తల్లి, బిడ్డ ఆరోగ్యమే మా విధి.. బర్త్ వెయిటింగ్ హాల్‌ను వినియోగించుకోండి
- దారకొండ వైద్యాధికారి డాక్టర్ బాబ్జీ



**గూడెం కొత్త వీధి, పెన్ పవర్, సెప్టెంబర్ 26:** గర్భిణులు సురక్షిత ప్రసవం కోసం దారకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏర్పాటు చేసిన బర్త్ వెయిటింగ్ హాల్‌ను సద్వినియోగం చేసుకోవాలని వైద్యాధికారి డాక్టర్ బాబ్జీ సూచించారు. ప్రసవ తేదీకి సుమారు 10 రోజుల ముందుగానే గర్భిణులు వైద్యుల సూచన మేరకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి చేరుకోవాలని తెలిపారు. బర్త్ వెయిటింగ్ హాల్‌లో గర్భిణులకు అవసరమైన అన్ని సదుపాయాలు కల్పిస్తున్నామని, ప్రసవం జరిగే వరకు వైద్యుల పర్యవేక్షణలో అక్కడే ఉండాలని సూచించారు. మూఢనమ్మకాలు, నాటు వైద్యం, అపోహలను నమ్మి ఇంటి వద్దే ఉండి గర్భిణులు, శిశువుల ప్రాణాలకు ముప్పు తెచ్చుకోవద్దని ఆయన సూచించారు. ప్రతి ఆశా కార్యకర్త తమ పరిధిలోని గర్భిణులపై ప్రత్యేక శ్రద్ధ వహించి, సకాలంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకురావాలని తెలిపారు. వైద్య కేంద్రానికి రావడానికి గర్భిణులు నిరాకరించిన సందర్భాల్లో వెంటనే తనకు ఫోన్ ద్వారా సమాచారం అందించాలని ఆశా కార్యకర్తలకు సూచించారు. తల్లి, బిడ్డ ఆరోగ్య పరిరక్షణకు వైద్య సిబ్బంది సమన్వయంతో పనిచేస్తున్నారని డాక్టర్ బాబ్జీ తెలిపారు.

# ద్వారకా బస్‌స్టేషన్‌లో డిజిటల్ ఫిర్యాదుల కేంద్రం

- ప్రజలకు మరింత సులభంగా పోలీసులకు ఫిర్యాదుల నమోదు
- పోలీస్ కమిషనర్ డా. శంఖబ్రత బాగ్చీ



**విశాఖ దక్షిణం పెన్ పవర్ సెప్టెంబర్ 26 :** ఏపీఎస్ఆర్టీసీ ద్వారకా బస్‌స్టేషన్‌లో ప్రయాణి కులు, ప్రజలు తమ సమస్యలను సులభంగా పోలీసులకు తెలియజేసేందుకు ఏర్పాటు చేసిన డిజిటల్ కంప్లైంట్ కియోస్క్‌ను విశాఖపట్నం పోలీస్ కమిషనర్ డా. శంఖబ్రత బాగ్చీ, ఐపీఎస్ శనివారం ప్రారంభించారు. బస్‌స్టేషన్‌లోని 22వ నంబర్ ప్లాట్‌ఫారమ్ వద్ద ఉన్న పోలీస్ ఔట్‌పో స్ట్‌లో ఈ కియోస్క్‌ను అందుబాటులోకి తీసుకొచ్చారు. ఈ కియోస్క్ ద్వారా ప్రజలు తమ ఫిర్యా దులను తెలుగు, ఇంగ్లీష్, హిందీ భాషల్లో పోలీ సుల సహాయంతో నమోదు చేసుకోవచ్చు. అలా గే వాయిస్ రికార్డింగ్ ద్వారా కూడా ఫిర్యాదును నమోదు చేసే సదుపాయం కల్పించారు. ఫిర్యా దు నమోదు అనంతరం సంబంధిత వ్యక్తికి రశీ దు అందజేయనున్నారు. నమోదైన ఫిర్యాదుల ను సంబంధిత అధికారులు పరిశీలించి, నిబంధ నల ప్రకారం తగిన చర్యలు తీసుకోనున్నారు.

ఈ సందర్భంగా కార్యక్రమానికి సభాధ్యక్షత వ హించిన విశాఖపట్నం జిల్లా ప్రజా రవాణా అధి కారి బి. అప్పలనాయుడు మాట్లాడుతూ, ఏపీఎస్ఆర్టీసీ ద్వారకా బస్‌స్టేషన్‌లో డిజిటల్ కంప్లైంట్ కియోస్క్ ఏర్పాటు చేయడం విశాఖ పట్నం నగరంతో పాటు ఉత్తరాంధ్ర ప్రాంత ప్రజలకు ఎంతో ఉపయోగకరమన్నారు. పోలీస్ స్టేషన్‌కు వెళ్లాల్సిన అవసరం లేకుండా బస్‌స్టేష న్‌లోనే ఫిర్యాదు నమోదు చేసుకునే అవకాశం లభించడం వల్ల ప్రయాణికులకు సౌలభ్యం కలు గుతుందని తెలిపారు. ఫిర్యాదులను పోలీస్ శాఖ ఎప్పటికప్పుడు పరిశీలించేందుకు ఈ వ్యవస్థ దోహదపడుతుందని ఆయన పేర్కొన్నా రు. డిజిటల్ కంప్లైంట్ కియోస్క్‌ను ఏర్పాటు చేసిన పోలీస్ కమిషనర్, పోలీస్ శాఖ, ప్రభు త్వానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

ముఖ్య అతిథిగా పాల్గొన్న పోలీస్ కమిషనర్ డా. శంఖబ్రత బాగ్చీ మాట్లాడుతూ, డిజిటల్ కంప్లైంట్ కియోస్క్ ప్రజలకు ఎంతో ఉపయోగక రంగా ఉంటుందని అన్నారు. ప్రయాణికులు, ఏపీఎస్ఆర్టీసీ సిబ్బంది ఈ సదుపాయాన్ని స ద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రజ లకు పోలీస్ సేవలను మరింత సులభంగా అం దించేందుకు ఇటువంటి సాంకేతిక పరిజ్ఞానా న్ని వినియోగించుకోవడం అవసరమని పేర్కొన్నా రు. అలాగే పోలీస్ శాఖకు ఎప్పటికప్పుడు సహకరిస్తున్న జిల్లా ప్రజా రవాణా అధికారి బి. అప్పలనాయుడుకు పోలీస్ కమిషనర్ కృతజ్ఞతలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో డీసీపీలు మణికంఠ, శ్రీమతి మేరీ ప్రశాంతి, మధు, పాపారావు, ఏసీపీలు, సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు, ఏడీసీపీ ట్రాఫిక్ ఎ. నరసిం హారావు, ఏపీఎస్ఆర్టీసీ డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ కె. పద్మావతి, అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ కె. గంగాధర్, పర్సనల్ ఆఫీసర్ జె. తిరుపతి, ఇతర పోలీస్, ఆర్టీసీ అధికారులు, సూపర్‌వైజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

# కనితి రోడ్‌లో ఘనంగా అన్న సమారాధన

వేలాది మంది భక్తుల పాల్గొనడం



**గాజువాక, పెన్ పవర్, సెప్టెంబర్ 26 :** 66వ వార్డు పరిధిలోని కనితి రోడ్ నవాబ్‌నగర్ లో శ్రీశ్రీశ్రీ సిద్ధి వినాయక చవితి మహోత్సవాల సందర్భంగా బాల గణపతి అసోసియేషన్ ఆధ్వ ర్యంలో భారీ అన్న సమారాధన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా 66వ వార్డు తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జ్, మాజీ కార్పొరేటర్ మహమ్మద్ రఫీ పాల్గొని అన్న సమారాధన కార్యక్రమాన్ని ప్రారం భించారు. అనంతరం భక్తులకు అన్న ప్రసాదా న్ని అందించారు. ఈ సందర్భంగా బాల గణపతి అసోసియేషన్ ప్రతినిధులు రఘువర్మ, రుషి, ఆనంద్, సాయి, వెంకీ, భాను, జమాల్, గణేష్, రెడ్డి, మణికంఠ తదితరులు కార్యక్రమ ఏర్పాట్లను పర్యవేక్షించా రు. కార్యక్రమంలో నిర్వాహకులతో పాటు వేలా ది మంది భక్తులు పాల్గొని స్వామివారి ప్రసాదా న్ని స్వీకరించారు.

# లలితకళలకు ప్రభుత్వం, సమాజం అండగా నిలవాలి



- రాష్ట్ర సమాచార కమిషనర్ పి.ఎస్. నాయుడు
- జాతీయ గ్రూప్ సాంగ్స్ పోటీలు--2026 ప్రారంభం

**విశాఖ దక్షిణం, పెన్ పవర్, సెప్టెంబర్ 26 :** లలితకళలు, సంగీతం, సాంస్కృతిక సంప్రదా యాల పరిరక్షణకు ప్రభుత్వం, సమాజం మరింత ప్రోత్సాహం అందించాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమాచార కమిషనర్ పి.ఎస్. నాయుడు అన్నా రు. కళాకారులకు తగిన అవకాశాలు, వేదికలు కల్పించడంతో పాటు వారి ప్రతిభను గుర్తించి ప్రోత్సహించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందన్నారు. కళలను పరిరక్షించడం అంటే భారతీయ సంస్కృతిని కాపాడటమేనని పేర్కొన్నారు. భారత్ వికాస్ పరిషత్--విశాఖపట్నం శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జాతీయ గ్రూప్ సాంగ్స్ పోటీలు--2026ను శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా పి.ఎస్. నా యుడు మాట్లాడుతూ, "స్వరాలు కలిస్తే సంగీ తం. హృదయాలు కలిస్తే సమైక్యత. మనసులు కలిస్తే భారతదేశం" అని అన్నారు. గ్రూప్ సాంగ్ కేవలం సంగీత పోటీ కాదని, యువతలో సమిష్టి భావన, క్రమశిక్షణ, సహకారం, సమన్వయం, నాయకత్వ లక్షణాలు, పరస్పర గౌరవాన్ని పెం పొందించేందుకు దోహదపడుతుందని తెలిపా రు. ఒకే తాళం, లయ, భావంతో పలువురు కలి సి పాడినప్పుడు అద్భుతమైన సంగీతం ఆవి ష్కృతమవుతుందని, ఇదే స్ఫూర్తి సమాజ నిర్మాణంలోనూ అవసరమన్నారు.

### సంగీతం సమైక్యతకు వారధి

సంగీతం భాష, ప్రాంతం, సంస్కృతులకు అతీ తంగా ప్రజలను ఏకం చేసే శక్తి కలిగి ఉందని పి.ఎస్. నాయుడు అన్నారు. పాట కేవలం వినో ద సాధనం కాదని, సందేశం, సంస్కృతి, భావో ద్వేగం, జాతీయ చైతన్యాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లే శక్తివంతమైన మాధ్యమమని పేర్కొన్నారు. స్వాతంత్ర్యోద్యమ సమయంలో దేశభక్తి గీతాలు ప్రజల్లో జాతీయ భావన, ఐక్యతను పెంపొందిం చడంలో కీలక పాత్ర పోషించాయని గుర్తుచేశా రు. నేటి యువత కూడా సంగీతం, కళల ద్వారా దేశభక్తి, సామాజిక బాధ్యత, మానవీయ విలు వలను సమాజంలో పెంపొందించాలని పిలు పునిచ్చారు.

### కళాకారులకు మరిన్ని అవకాశాలు కల్పించాలి

సంగీతం, నృత్యం, నాటకం, చిత్రలేఖనం తది తర లలితకళలు భారతీయ సంస్కృతికి ప్రతి బింబాలని పి.ఎస్. నాయుడు అన్నారు. కళాకా రులు తమ ప్రతిభ ద్వారా సాంస్కృతిక వారస త్వాన్ని తరతరాలకు అందిస్తున్నారని తెలిపా రు. కళాకారులను ప్రభుత్వం మాత్రమే కాకుండా స్వచ్ఛంద సంస్థలు, విద్యాసంస్థలు, పారిశ్రామిక వేత్తలు, సమాజంలోని వివిధ వర్గాలు కూడా ప్రోత్సహించాలని కోరారు. కళాకారులకు ప్రద ర్శనలు ఇచ్చేందుకు మరిన్ని వేదికలు, అవకాశా లు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు.

### యువతకు విలువలతో కూడిన విద్య అవసరం

భారత్ వికాస్ పరిషత్ ప్రధాన విలువలైన సంపర్క్, సహయోగ్, సంస్కార్, సేవ, సమర్పణ యువతకు మార్గదర్శకంగా నిలవాలని పి.ఎస్. నాయుడు అన్నారు. విద్య జ్ఞానాన్ని అందిస్తే, సంస్కారం ఆ జ్ఞానానికి సరైన దిశను చూపు తుందని పేర్కొన్నారు. ప్రతిభ విజయాన్ని అందిం చగలిగినా, వ్యక్తిత్వం, విలువలే ఆ విజయానికి గౌరవాన్ని తీసుకువస్తాయని అన్నారు. విద్యార్థు లు కేవలం బహుమతుల కోసం కాకుండా ఆనం దంగా, ఆత్మవిశ్వాసంతో, దేశభక్తితో, సామాజిక బాధ్యతతో ప్రదర్శనలు ఇవ్వాలని సూచించా రు. గెలుపు, ఓటముల కంటే పోటీ ద్వారా పొం దే క్రమశిక్షణ, స్నేహం, సహకారం, ధైర్యం, ఆత్మ విశ్వాసం జీవితంలో మరింత ఉపయోగపడ తాయని పేర్కొన్నారు.

### ఆధునికతతో పాటు సంస్కృతిని కాపాడాలి

కృత్రిమ మేధస్సు, డిజిటల్ సాంకేతికత వంటి ఆధునిక పరిజ్ఞానం యువతకు కొత్త అవకాశా లను అందిస్తున్నప్పటికీ, భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు, కళలు, సంగీతం, మానవీయ విలువలను కాపాడుకోవాలని పి.ఎస్. నాయు డు సూచించారు.

"మూలాల్లో భారతీయత--ఆలోచనల్లో ఆధు నికత--చర్యల్లో మానవత్వం" అనే సమతు ల్యతను యువత అలవర్చుకోవాలని ఆకాంక్షిం చారు.

### విజేతలకు సత్కారం

జాతీయ గ్రూప్ సాంగ్స్ పోటీలు--2026లో విజే తలుగా నిలిచిన బృందాలకు మెమెంటోలు, సర్టి ఫికెట్లు అందజేసి అభినందించారు. పోటీల్లో పాల్గొన్న అన్ని బృందాలను నిర్వాహకులు అభి నందించారు. అనంతరం కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర సమాచార కమిషనర్ పి.ఎస్. నాయుడును నిర్వాహకులు ఘనంగా సన్మానించి జ్ఞాపికను అందజేశారు.

ఈ కార్యక్రమంలో ఆంధ్ర విశ్వవిద్యాలయం మాజీ ఉపకులపతి ప్రొఫెసర్ జి. నాగేశ్వరరావు, విశిష్ట అతిథులు రమేష్ చంద్ జైన్, వంకాయల సన్యాసి రాజు, ఎం.వి.వి. సత్యనారాయణ, భా రత్ వికాస్ పరిషత్ విశాఖపట్నం శాఖ అధ్యక్షు లు చి.వి. సత్యనారాయణ, కార్యదర్శి వంకా యల జవహర్, కోశాధికారి డి. వెంకటరావు, కన్వీనర్ ఎం.ఎస్.ఎల్. శైలజ, నిర్వాహకులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు, కళాకారులు తదితరులు పాల్గొన్నారు.

# యువతను రాజకీయ ప్రచారంలోకి లాగొద్దు




యువత తమ ప్రతిభను ఉపయో గించుకుని భవిష్యత్తును నిర్మించు కోవాలి ఆడారి దివ్యకళ

**విశాఖ దక్షిణం, పెన్ పవర్, ఆగస్టు 26 :** సోషల్ మీడియా ఖాతాల పేరుతో యువతను రాజకీయ ప్రచారంలోకి లాగవద్దని జిల్లా పార్టీ అధికార ప్రతినిధి ఆడారి దివ్యకళ సూచించా రు. యువత తమ సోషల్ మీడియా ఖాతాలు, వ్యక్తిగత గుర్తింపును రాజకీయ ప్రయోజనాల కోసం వినియోగించుకునే అవకాశాలను ఇవ్వ కుండా అప్రమత్తంగా ఉండాలని కోరారు. మద్దిలపాలెం కృష్ణ కాలేజ్ రోడ్డులోని పార్టీ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన పత్రికా సమా వేశంలో ఆమె మాట్లాడారు. ప్రస్తుత రాజకీయా ల్లో సోషల్ మీడియా ఒక ముఖ్యమైన ప్రచార సాధనంగా మారిందని, అయితే యువతను లక్ష్యంగా చేసుకుని ప్రత్యేకంగా సోషల్ మీడి యా ఖాతాలను సృష్టించడం, వాటి ద్వారా రాజకీయ ప్రచారం నిర్వహించడం, ఆర్థిక లావా దేవీల్లో భాగస్వాములను చేయడం వంటి అంశాలపై జాగ్రత్త అవసరమన్నారు. యువతకు వ్యక్తిగత సోషల్ మీడియా ఖాతాలు కలిగి ఉండటం, తమకు నచ్చిన వ్యక్తులు, అంశాలను అను సరించడం వారి వ్యక్తిగత స్వేచ్ఛలో భాగమని పేర్కొన్నారు. అయితే రాజకీయ ప్రయోజనాల కోసం పెద్ద సంఖ్యలో ఖాతాలు సృష్టించడం, వాటిని నిర్వహించడం, నిర్దిష్ట వ్యక్తులు లేదా పార్టీలకు అనుకూలంగా ప్రచారం చేయడం వంటి కార్యకలాపాల్లో తెలియకుండానే భాగ స్వాములు కావద్దని సూచించారు.

"యువతకు తమ సొంత ప్రతిభ ఉంది. ఆ ప్రతి భను ఉపయోగించుకుని భవిష్యత్తును నిర్మించుకోవాలి. రాజకీయ ప్రచారాల కోసం మీ సోష ల్ మీడియా ఖాతాలు, పేరు, వ్యక్తిగత గుర్తింపు ను ఉపయోగించుకునే అవకాశం ఇవ్వవద్దు" అని ఆమె అన్నారు.

కొంతమంది యువతకు ఆఫర్లు, ఆర్థిక ప్రయోజ నాలు లేదా ఇతర ప్రలోభాలు చూపించి సోషల్ మీడియా ప్రచారంలోకి తీసుకువచ్చే ప్రయత్నా లు జరుగుతున్నాయనే ఆరోపణలు ఉన్నాయ ని దివ్య కళ పేర్కొన్నారు. ఇలాంటి వ్యవహారా ల్లో పాల్గొనే ముందు వాటి ఉద్దేశం, ఎవరి కోసం నిర్వహిస్తున్నారనే విషయాలను పూర్తిగా తెలు సుకోవాలని సూచించారు. రాజకీయ ప్రచారానికి సంబంధించిన సోషల్ మీడియా కార్యకలాపా ల్లో పాల్గొన్నప్పుడు భవిష్యత్తులో వివాదాలు లేదా చట్టపరమైన సమస్యలు తలెత్తే అవకాశం ఉందని, అందువల్ల యువత ముందుగానే జాగ్రత్త వహించాలని అన్నారు. ఎవరైనా తమ పేరు మీద సోషల్ మీడియా ఖాతాలు సృష్టిం చాలని, తమ ఖాతాల ద్వారా ప్రచారం నిర్వ హించాలని లేదా ఆర్థిక లావాదేవీలు చేయాలని కోరితే వెంటనే అంగీకరించకుండా పూర్తి వివరాలు తెలుసుకోవాలని సూచించారు. యువత చదువు, ఉద్యోగం, వ్యాపారం, ప్రతిభాభివృద్ధిపై దృష్టి సారించాలని ఆమె కోరారు. రాజకీయ నాయకులు, పార్టీ కార్యకర్తలు తమ కార్యకలా పాలను నిర్వహించుకోవచ్చని, అయితే సామా న్య యువత, విద్యార్థులు, సోషల్ మీడియా వినియోగదారులను అనవసర రాజకీయ వివా దాల్లోకి లాగడం సరికాదన్నారు.

యువత తమ భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని సోషల్ మీడియాను బాధ్యతాయుతంగా విని యోగించాలని, అనుమానాస్పద రాజకీయ ప్ర చారాలు, ఆర్థిక లావాదేవీలకు దూరంగా ఉం డాలని ఆడారి దివ్య కళ కోరారు.

# ముస్లిం మైనార్టీలకు ప్రాతినిధ్యం కల్పించాలని వినతి

**గాజువాక, పెన్ పవర్, సెప్టెంబర్, 26 :** గాజువాక నియోజకవర్గంలో ముస్లిం మైనార్టీల కు రాజకీయ ప్రాతినిధ్యం కల్పించాలని కోరు తూ ముస్లిం పెద్దలు, తెలుగుదేశం పార్టీ నాయ కులు రాష్ట్ర తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు, గాజువాక శాసనసభ్యుడు పల్లా శ్రీనివాసరా వును కలిసి వినతిపత్రం సమర్పించారు.

గాజువాక నియోజకవర్గ ముస్లిం మైనార్టీ అధ్య క్షుడు షేక్ రహిమాన్ ఆధ్వర్యంలో 66వ వార్డు తెలుగుదేశం పార్టీ నాయకులు, ముస్లిం మైనార్టీ ప్రతినిధులు పల్లా శ్రీనివాసరావును కలిసి తమ సమస్యలు, రాజకీయ ప్రాతినిధ్యానికి సంబం ధించిన అంశాలను వివరించారు. రాబోయే గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో గాజువాక నియోజకవర్గ పరిధిలో ముస్లిం మైనా ర్టీలకు ఒక వార్డు కేటాయించి, ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం కల్పించాలని వారు కోరారు.



మైనార్టీ వర్గాల అభివృద్ధి, సంక్షేమానికి కూటమి ప్రభుత్వం సహాయ సహకారాలు అందించాలని, ముస్లిం సోదరులను రాజకీయంగా కూడా భాగ స్వాములను చేయాలని నాయకులు విజ్ఞప్తి చేశారు. తమకు అవకాశం కల్పిస్తే పార్టీ నాయ కత్వం ఆశీస్సులతో విజయం సాధించి ప్రజలకు సేవ చేస్తామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పల్లా శ్రీనివాసరావు ముస్లిం మైనార్టీలను కలు పుకొని ముందుకు వెళ్లే విధంగా అందరూ పని చేయాలని సూచించినట్లు నాయకులు తెలిపా రు. రాబోయే ఎన్నికల్లో అవకాశం కల్పించే అం శాన్ని పరిశీలిస్తామని ఆయన హామీ ఇచ్చినట్లు వెల్లడించారు.

ఈ కార్యక్రమంలో 66వ వార్డు తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు గోమాడ వాసు, గాజువాక నియోజకవర్గ మైనార్టీ అధ్యక్షుడు షేక్ రహిమా న్, మహమ్మద్ భాష, మహమ్మద్ ఆరిఫ్, షేక్ ఖాదర్, అబ్దుల్ ఖయ్యూం, నూర్ అహ్మద్, ప్రకాష్ బీఎస్ఎఫ్, బుజ్జి కేబుల్ తదితరులు పాల్గొన్నారు.

# తెలుగు రాని ఐఏఎస్ అధికారులతో మన్యం ప్రజలకు ఇబ్బందులు

**పాడేరు ఐటీడీఏకు తెలుగు తెలిసిన అధికారులను నియమించాలి**

**మన్యం ప్రజా గాయకుడు దుడ్డు సత్యనారాయణ డిమాండ్**

**స్టాఫ్ రిపోర్టర్ పాడేరు, పెన్ పవర్, సెప్టెంబర్ 26:** మన్యం ప్రజలకు ఆయువుపట్టు, జీవనాడిగా ఉన్న పాడేరు ఐటీడీఏకు తెలుగు భాషపై పూర్తి అవగాహన ఉన్న అధికారులను నియమించాలని మన్యం ప్రజా గాయకుడు డిమాండ్ చేశారు. తెలుగు తెలియని అధికారుల వల్ల గిరిజన ప్రజలు తమ సమస్యలను సరిగా వివరించుకోలేని పరిస్థితి ఏర్పడుతోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. మన్యం ప్రాంతంలో గిరిజన ప్రజలకు ఏ సమస్య వచ్చినా తమ గోడును వినిపించుకునేందుకు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారిని ఆశ్రయిస్తారని తెలిపారు. అలాంటి కీలక బాధ్యతలు నిర్వహించే అధికారికి తెలుగు భాషపై పూర్తిస్థాయి అవగాహన లేకపోతే సామాన్య గిరిజనులు తమ సమస్యలను ఎలా వివరించుకోగలరని ప్రశ్నించారు. తమ బాధను అధికారికి చెప్పుకున్నామనే కనీస సంతృప్తి కూడా ప్రజలకు లేకుండా పోతుందని పేర్కొన్నారు. ఇటీవల మారికవలసకు సంబంధించిన అంశంలో గిరిజన తల్లులు తమ పిల్లలకు సంబంధించిన సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చిన సమయంలో భాషాపరమైన ఇబ్బందులు ఎదురైనట్లు ఆయన పేర్కొన్నారు. ప్రజల సమస్యలను సమర్థవంతంగా అర్థం చేసుకుని పరిష్కరించేందుకు స్థానిక భాషపై అవగాహన ఎంతో అవసరమని అన్నారు. ఇదిలా ఉండగా, ఇదే ఐటీడీఏ ప్రాజెక్టు అధికారికి డీఆర్వోగా అదనపు బాధ్యతలు అప్పగించడం వల్ల ప్రజలకు మరింత ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. గిరిజన రైతులు భూమి సమస్యలు, ఇతర రెవెన్యూ అంశాలపై అధికారిని కలిసినప్పుడు తమ సమస్యలను పూర్తిస్థాయిలో వివరించలేని పరిస్థితి ఏర్పడితే, వారి దరఖాస్తులు పరిష్కారానికి నోచుకోకుండా పోయే ప్రమాదం ఉందన్నారు. గిరిజనుల సమస్యలను ప్రత్యక్షంగా అర్థం చేసుకుని, వారితో సులభంగా సంభాషించే విధంగా తెలుగు భాషను సంపూర్ణంగా మాట్లాడగల అధికారులను మన్యం ప్రాంతానికి నియమించాలని పాలక పెద్దలను మన్యం ప్రజా గాయకుడు కోరారు. ప్రజలకు, అధికార యంత్రాంగానికి మధ్య భాషా సమస్య అడ్డంకిగా



మారకుండా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# తూర్పు నియోజకవర్గం లో మిగుల పట్టాల పంపిణీ

**28, 29 తేదీల్లో 5 వార్డులలో పట్టాల పంపిణీ కార్యక్రమం - లబ్ధిదారులు ఆహ్వాన పత్రంతో రావాలి**



**విశాఖ తూర్పు / పెన్ పవర్ సెప్టెంబర్ 26:** విశాఖ తూర్పు నియోజకవర్గంలో మిగుల రెగ్యులరైజేషన్ పట్టాల పంపిణీకి ఎట్టకేలకు ముహూర్తం ఖరారైంది. మొత్తం 5 వార్డులకు సంబంధించి 1788 మంది లబ్ధిదారులకు పట్టాలు అందజేయడానికి రెవెన్యూ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.
ఈ మేరకు రెవెన్యూ అధికారులు షెడ్యూల్ విడుదల చేశారు.
పంపిణీ వివరాలు:
మొదటి రోజు – సెప్టెంబర్ 28, సోమవారం ఉదయం 10 గంటలకు
వార్డు నెం. 9 & 10: మొత్తం 357 పట్టాలు. వేదిక: అరవ లక్ష్మి కమ్యూనిటీ హాల్, రవీంద్రనగర్.
వార్డు నెం. 11: మొత్తం 620 పట్టాలు. వేదిక: రాధాకృష్ణ కళ్యాణ మండపం, తోటగరువు హైస్కూల్ పక్కన.
రెండవ రోజు – సెప్టెంబర్ 29, మంగళవారం ఉదయం 10 గంటలకు
వార్డు నెం. 12: మొత్తం 289 పట్టాలు. వేదిక: రాధాకృష్ణ కళ్యాణ మండపం, తోటగరువు హైస్కూల్ పక్కన.
వార్డు నెం. 13: మొత్తం 522 పట్టాలు. వేదిక: వుడా ఫంక్షన్ హాల్, అరిలోవ లాస్ట్ బస్టాప్.
ఈ పట్టాల పంపిణీ కార్యక్రమాన్ని ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రశాంతంగా నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులకు ఆదేశించారని. ప్రతి వేదిక వద్ద హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేసి, కౌంటర్ స్లిప్పులు సిద్ధం చేయాలని సూచించారు. లబ్ధిదారులందరికీ వి ఆర్ ఒ లు స్థానిక ప్రజా ప్రతినిధుల సహకారంతో సమాచారం అందించాలని, లబ్ధిదారుడు మాత్రమే ఆహ్వాన పత్రంతో కార్యక్రమానికి హాజరు కావాలని అధికారులు స్పష్టం చేశారని,టిడిపి వార్డుల అధ్యక్షులు తెలియజేశారు

# కూలిన ఇంటి మెట్లను సొంత నిధులతో నిర్మిస్తానని హామీ



**విశాఖ దక్షిణం, పెన్ పవర్, సెప్టెంబర్ 26 :**భారీ వర్షాల కారణంగా పేద కుటుంబం నివసి స్తున్న స్కీం ఇంటి మెట్లు కూలిపోవడంతో మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ ఆ కుటుం బాన్ని పరామర్శించారు. దక్షిణ నియోజకవ ర్గంలోని 37వ వార్డు కొత్త అగ్రహారం ప్రాంతంలో చోటుచేసుకున్న ఈ ఘటనలో ఇంట్లో నివసిస్తు న్న గనగల కనకమహాలక్ష్మి, గనగల ఎల్లమ్మ, నంద దివ్య గాయపడగా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.మెట్లు కూలిపోవడంతో ఇం ట్లోకి వెళ్లేందుకు, బయటకు వచ్చేందుకు మార్గం లేక కుటుంబ సభ్యులు ఇబ్బందులు ఎదుర్కొం టున్నారు. ఈ విషయం స్థానిక వైసీపీ నాయకు లు, కార్యకర్తల ద్వారా వాసుపల్లి గణేష్ కుమార్ దృష్టికి వెళ్లింది.సమాచారం అందుకున్న ఆయన వెంటనే వార్డు నాయకులు, కార్యకర్తలతో కలిసి బాధిత కుటుంబం ఇంటికి వెళ్లి పరిస్థితిని పరిశీ లించారు. కుటుంబ సభ్యులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. కూలి పోయిన మెట్లను తన సొంత నిధులతో పునర్నిర్మించి ఇస్తానని హామీ ఇచ్చారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులకు ఆర్థిక సహాయం అందిస్తానని తెలిపారు.ప్రభుత్వం నుంచి సహా యం అందే వరకు వేచి చూడకుండా అవసర మైన సహకారం అందిస్తామని ఆయన పేర్కొ న్నారు. వర్షాల కారణంగా ఇబ్బందులు ఎదు ర్కొంటున్న కుటుంబాలకు అండగా ఉంటామని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా వైస్ ప్రెసిడెంట్ రైయ్ డేవిడ్ రాజు, జిల్లా జనరల్ సెక్రటరీ గనగళ్ల రామరాజు, జిల్లా సెక్రటరీ బొడ్డు ఆనంద్, జిల్లా బీసీ సెల్ జనరల్ సెక్రటరీ చోడిపిల్లి శివ, సౌత్ వైయస్ఆర్పిఎఫ్ ప్రెసిడెంట్ దైవ కుమార్, వార్డు వైస్ ప్రెసిడెంట్ నోళ్ల చంటి, 37వ వార్డు వైసీపీ నాయకులు, కార్యకర్తలు, స్థానికులు పాల్గొన్నా రు. బాధిత కుటుంబ సభ్యులు, స్థానికులు వాసుపల్లి గణేష్ కుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

# వర్షాల వల్ల అధిక పంట దిగుబడి



- మండలంలో పలు పంచాయతీలో పంటలు పరిశీలన.
- మండల వ్యవసాయ శాఖ అధికారి గిరడ మురళీకృష్ణ.

**ముంచంగిపుట్టు, పెన్ పవర్, సెప్టెంబర్ 26.**తీవ్ర వాయుగుండం కారణంగా భారీ వర్షాల వల్ల ప్రభావితమైన పంట పొలాలను ముంచంగిపుట్టు మండల వ్యవసాయ శాఖ అధికారి గిరడ మురళీకృష్ణ క్షేత్రస్థాయిలో పర్యటించి పరిశీలించారు. తీవ్ర వర్షాభావం కారణంగా దెబ్బతిన్న పంటల వివరాలను, భారీ వర్షాల వల్ల ముంపునకు గురైన పంట నష్టాలను అంచనా వేశారు. గత 4 రోజులు నుంచి పడిన వర్షాలు రైతులకి చాల ఉపయోగం ఉందని, ముఖ్యంగా వర్షాలు వలన వరికు ఎక్కువగా పిలకలు వచ్చి అధిక దిగుబడులు వస్తాయనీ ఆయన అన్నారు. వర్షాలు తగ్గాయి కాబట్టి రైతులు ఘన జీవామృతం ద్రవ జీవామృతం వంటి కాషాయాల పిచికారి చేసుకుంటే అధిక పిలకలు పెట్టి దిగుబడి పెరుగుతుందన్నారు. అదేవిధంగా రాగులు సామల పంటలు వర్షాలకు తొందరగా పెరిగి అధిక దిగుబడులు వస్తాయని, ఎక్కడైన నీరు నిల్వ ఉంటే రైతులు అధిక నీటిని తీసి వేసి పాడి పశువుల గతం వేసుకోవాలని రైతులకు సూచించారు. కిలగడ, బంగారుమెట్ట, వనభసింగి, దారేల, జోలాపుట్ ప్రాంతాలలో వర్షాలకి పంటలు బాగానే ఉన్నాయని, ఎక్కడైనా పంట నష్టం జరిగితే వ్యవసాయ సిబ్బంది రైతు సేవా కేంద్రాలలో సమాచారం అందించాలన్నారు.

# బుంగాపుట్టు గ్రామస్తులకు దడ పుట్టిస్తున్న కొండచిలువ

- నిత్యం జనవాసలో సంచరించడం పట్ల భయాందోళనలో ప్రజలు.



**ముంచంగిపుట్టు, పెన్ పవర్, సెప్టెంబర్ 26.**మండలంలో గల బుంగాపుట్టు గ్రామ సమీప అడవిలో సుమారు 12 అడుగులు కొండచిలువ హల్చల్ చేస్తుంది. పశువుల కాపుకు వెళ్ళిన వారు తమ మొబైల్ ఫోన్ లో కొండచిలువను వీడియోలు తీశారు. కాగా బుంగాపుట్టు గ్రామ సమీపా గ్రామమైన గగ్రం లో ఓ భారీ కొండచిలువ మేకను చంపగా గ్రామస్తులు వాటిని హత మార్చారు. రెండు మూడు రోజుల వ్యవధిలో రెండు భారీ కొండచిలువలు కనబడడంతో ఆయా ప్రాంత వాసులు హడలెత్తిపోతున్నారు. వీటిపై అటవీశాఖ అధికారులు దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు.

# కొప్పిశెట్టివారి వీధిలో ఘనంగా అన్నసమారాధన



పెన్ పవర్, **ద్వారకాతిరుమల, సెప్టెంబర్ 26:**ద్వారకాతిరుమల స్థానిక గ్రంథాలయం సెంటర్‌లో కొప్పిశెట్టివారి వీధి ఐదో వార్షిక గణపతి నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా శ్రీ విఘ్నేశ్వర యూత్ కమిటీ ఆధ్వర్యంలో శనివారం అన్నసమారాధన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా సుమారు 5 వేల మంది భక్తులకు అన్నప్రసాదాన్ని అందించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి ప్రసాదాన్ని స్వీకరించారు. కమిటీ సభ్యులు, గ్రామస్తుల సమన్వయం, సహకారంతో అన్నసమారాధన కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు. ఉత్సవాల సందర్భంగా వీధిలో భక్తి వాతావరణం నెలకొంది.

# గణనాధుడికి ఘనంగా వీడ్కోలు







**అన్న సమారాధనలు వినాయక నిమజ్జన కార్యక్రమాలతో నాయకులు ప్రజలు బిజీగా గడిపారు**

**విశాఖ తూర్పు,పెన్ పవర్, సెప్టెంబర్ 26:** తూర్పు నియోజకవర్గం పరిధిలో పలు వార్డులలో వినాయక చవితి సందర్భంగా శనివారం పలు ప్రాంతాలలో అన్న సమారాధనలు నిమజ్జన కార్యక్రమాలు ప్రజలు బిజీగా గడిపారు కార్యక్రమాలకు ముఖ్య అతిథిగా పాల్గొని వివిధ పార్టీల నాయకులు కార్యకర్తలు నిర్వాహకులు పోటీపడి కార్యక్రమాలలో పాల్గొన్నారు. తుఫాను కారణంగా ఎడతెరిపిలేని వర్షాలకు వినాయక చవితి పందిళ్లలో చేయవలసిన కార్యక్రమాలు అన్న సమారాధనలు నిర్వహించకపోవడంతో శనివారం అధిక శాతం అన్న సమారాధన కార్యక్రమాలు నిర్వహించారు. ఒకే ప్రాంతంలో ప్రక్క ప్రక్క వీధులలో అన్న సమారాధన నిర్వహించడం తో ఆ ప్రాంతాలు సందడిగా మారాయి. వీధులలో ఎక్కడ చూసినా వినాయక చవితి సందర్భంగా విరాళాలు ఇచ్చిన దాతలు పేర్లు అన్న సమారాధనకు ఆహ్వానం నిమజ్జన కార్యక్రమాలు డబ్బులు డిజెలతో గణనాథుని ఊరేగింపు పురవీధులన్నీ కోలాహలంగా మారాయి. 12వ వార్డు రాజీవ్ నగర్ విఐపి ఫ్రెండ్స్ ఆధ్వర్యంలో అన్నసమారాధన నిర్వహించారు అదేరోజు అనుపు కార్యక్రమాలు చేపట్టారు.లీలా సుందర్ ఎల్లో బాయ్స్,ఎర్ని దుర్గా నగర్, కనకదుర్గ నగర్, బాలాజీ నగర్ టిఐసి పాయింట్ పలు ప్రాంతాల నుండి గణనాథుని ఊరేగింపు తో నిమజ్జన కార్యక్రమాలు జోడిగుడ్ల పాలెం,బీచ్ రోడ్డు వరకు కొనసాగాయి.

# 25 ఏళ్లుగా టీడీపీకి సేవ చేశా సాలపు రామారావు

**మేయర్ అభ్యర్థిగా అవకాశం కల్పించాలని విజ్ఞప్తి**



**గాజువాక, పెన్ పవర్, సెప్టెంబర్ 26 :**తెలుగుదేశం పార్టీకి గత 25 సంవత్సరాలుగా సేవలందిస్తూ, పార్టీ సిద్ధాంతాలకు అనుగుణం గా ప్రజా సేవలో కొనసాగుతున్నానని టీడీపీ సీనియర్ నాయకుడు సాలపు రామారావు తెలిపారు.ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ, తన రాజకీయ ప్రస్థానంలో పార్టీ కోసం అంకిత భావంతో పనిచేశానని పేర్కొన్నారు. ప్రజా సమ స్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తూ పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొన్నానని తెలిపారు.రాబోయే జీవీఎంసీ ఎన్నికల్లో మేయ ర్‌గా పోటీ చేయాలని నిర్ణయించుకున్నట్లు సాలపు రామారావు వెల్లడించారు. తన సుదీర్ఘ పార్టీ సేవలను గుర్తించి, మేయర్ అభ్యర్థిగా అవకాశం కల్పించాలని పార్టీ అధిష్ఠానానికి విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో 97వ వార్డు నాయకులు అక్కిన లక్ష్మణరావు, సిహెచ్. కన్నారావు, ప్రధాన కార్యదర్శి దాసరి విజయ్ సాయి, డి.వి. సత్యా రావు, మహిళా అధ్యక్షురాలు వరలక్ష్మి, యజ్ఞప్రి య తదితరులు పాల్గొన్నారు.

# ఐఎన్ఎస్ డేగా పరిసరాల్లో పర్యావరణ నిర్వహణ పక్కాగా ఉండాలి



**విశాఖ దక్షిణం, పెన్ పవర్, సెప్టెంబర్ 26 :** ఐఎన్ఎస్ డేగా పరిసరాల్లో పర్యావరణ నిర్వ హణను పటిష్టంగా చేపట్టడంతో పాటు విమా నాల సురక్షిత రాకపోకలకు ఎలాంటి ఆటంకా లు లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్ అధికారులను ఆదేశించారు. శనివారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ఎయిర్‌ఫీల్డ్ ఎన్విరాన్‌మెంట్ మేనేజ్‌మెంట్ కమిటీ సమావే శంలో ఆయన పలు అంశాలపై సమీక్షించారు.జ్ఞానాపురం, ఐఎన్ఎస్ డేగా పరిసర ప్రాంతాల్లో పక్షులు, వన్యప్రాణుల కారణంగా విమానాల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తకుండా నిరం తరం పర్యవేక్షించాలని కలెక్టర్ సూచించారు. బహిరంగ ప్రదేశాల్లో చెత్త, మాంస వ్యర్థాలను పడవేయకుండా చర్యలు చేపట్టాలని ఆదేశిం చారు.పక్షులు, జంతువులను ఆకర్షించే పరిస్థి తులను నివారించడంతో పాటు అనధికారిక మాంస దుకాణాలు, వ్యర్థాల నిల్వ ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు సూ చించారు. విమానాశ్రయ పరిసరాల్లో పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణకు సంబంధించిన నిబంధ నలు కచ్చితంగా అమలయ్యేలా చర్యలు తీసు కోవాలని స్పష్టం చేశారు.ఈ సమావేశంలో ఐఎన్ఎస్ డేగా అధికారులు, డీఆర్వో విశ్వేశ్వరనాయుడు, ఆర్డీవో దిలీప్ చక్రవర్తి, జీవీఎంసీ, రెవెన్యూ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# గోకవరంలో విద్యా కమిటీ ఎన్నికల్లో కూటమి కె విజయావకాశం..!





- వైసీపీలో సరైన నాయకత్వం లేక కేడర్ నిస్తేజం..!

**గోకవరం పెన్ పవర్ సెప్టెంబర్ 26:-** రాష్ట్రవ్యాప్తంగా మంగళవారం జరగనున్న విద్యా కమిటీ (తల్లిదండ్రుల కమిటీ )ఎన్నికలకు గోకవరం మండలంలో రంగం సిద్ధమైంది.గోకవరం మండలంలో 90% నుండి 100% స్థానాలను కూటమి (టీడీపీ–జనసేన–బీజేపీ) కైవసం చేసుకునే అవకాశం ఉందని పలువురు తమ విశ్వాసాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఇది రానున్న స్థానిక సంస్థల ఎన్నికలకు ఒక రెఫరెండం గా మారనుంది.తెలుగుదేశం పార్టీ ఈ చిన్న ఎన్నికను కూడా చాలా సీరియస్ గా తీసుకుంది.పార్టీ మండల నాయకత్వం ఆధ్వర్యంలో మండలస్థాయి నాయకులు కేడర్ తో ఇప్పటికే సమావేశాలు నిర్వహించి దిశా నిర్దేశం చేశారు. ఇలాంటి చిన్న ఎన్నికలను కూడా సీరియస్ గా తీసుకోవాలని రేపు జరగబోయే స్థానిక ఎన్నికలకు ఇదే పునాది అని కేడర్ కు దిశానిర్దేశం చేశారు. క్రమ శిక్షణ, సమన్వయంతో ముందుకు వెళ్లడమే కూటమికి కలిసి వచ్చే అంశంగా విశ్లేషకులు చెబుతున్నారు. మరోవైపు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పరిస్థితి పూర్తి భిన్నంగా ఉంది. ఎన్నడూ లేని విధంగా పార్టీకి అవకాశం ఉన్నా, సరైన కేడర్ లేకపోవడం, సమన్వయం చేసే నాయకుడు లేకపోవడం పెద్ద మైనస్ గా మారింది.అధినేత జగన్మోహన్ రెడ్డి గారు ప్రతి ఎన్నికలో పోటీ చేయాలని చెబుతున్నా, ఇక్కడ మాత్రం విద్యా కమిటీ ఎన్నికలే కదా నెగ్గకపోయినా పర్వాలేదు, మా కుర్చీలు పదిలంగా ఉన్నాయి అనే మేకపోతు గాంభీర్యంతో కొందరు నాయకులు వ్యవహరిస్తున్నారని వైసీపీ అభిమానులే వేదనతో వాపోతున్నారు.ఏ ఒక్క గ్రామంలో కూడా పార్టీ సమావేశం, కార్యకర్తల సమన్వయం జరగలేదు దీంతో పార్టీ క్యాడర్ పూర్తిగా స్తబ్దుగా ఉండిపోయింది. ఈ లోటు ఇప్పట్లో తీరే అవకాశం కనిపించడం లేదని పలువురు అంటున్నారు.ఒక క్రమశిక్షణ కలిగిన, విధేయత గల కార్యకర్తలు,నాయకత్వంతో ముందుకు వెళితే ఏ పార్టీ అయినా సాధిస్తుంది. నియంతృత్వంతో వెళితే ఏ పార్టీ కూడా ప్రజా కోర్టులో నిలబడి గెలిచే అవకాశం ఉండదు. దీనికి రేపు జరగనున్న విద్యా కమిటీ ఎన్నికలే కాకుండా, రానున్న స్థానిక సంస్థల ఎన్నికలు కూడా గోకవరం మండలంలో నిదర్శనంగా నిలవబోతున్నాయని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయ పడుతున్నారు.ఏది ఏమైనా మంగళవారం ఉదయం గోకవరం మండలంలో అందరూ సైకిల్ ఎక్కే అవకాశం ఉందని, ప్రభుత్వ బడి గంట కూటమే మోగించనుందని, అందరూ ధీమాగా ఉన్నారు. అన్నట్టు కూటమి ప్రభుత్వానికే వదిలేస్తారా అవకాశం ఉన్నచోట అన్న పోరాడి నిలుస్తారా ఏం జరుగుతుందో మంగళవారం వరకు వేచి చూడాలి.

# ఎర్రకాలువ ముంపు పొలాలను పరిశీలించిన వడ్డి రఘురామ్ నాయుడు





**తాడేపల్లిగూడెం. పెన్ పవర్. సెప్టెంబర్ 26**:తుఫాను ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు ఎర్రకాలువ ఉధృతంగా ప్రవహించడంతో తాడేపల్లిగూడెం నియోజకవర్గ పరిధిలోని పలు ప్రాంతాల్లో పంట పొలాలు ముంపునకు గురయ్యాయి. ముంపు కారణంగా పంటలు దెబ్బతిని రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో... తాడేపల్లిగూడెం నియోజకవర్గ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి వడ్డి రఘురామ్ నాయుడు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ముంపు ప్రాంతాల్లో పర్యటించారు. నందమూరు, మారంపల్లి, జగన్నాథపురం, దండగర్ర, మాధవరం గ్రామాల్లో పర్యటించిన వడ్డి రఘురామ్ నాయుడు... ఎర్రకాలువ ముంపుతో నీట మునిగిన పంట పొలాలను పరిశీలించారు.

పొలాల్లో నిలిచిన నీటిని పరిశీలిస్తూ... రైతులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను, పంట నష్టాన్ని, పెట్టుబడుల పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ముంపు కారణంగా పంటలు దెబ్బతిన్నాయని రైతులు తమ ఆవేదనను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. పంట నష్టం మాత్రమే కాకుండా... పంట కోసం చేసిన పెట్టుబడులు కూడా నష్టపోయే పరిస్థితి ఏర్పడిందని రైతులు వివరించారు.

ఈ సందర్భంగా వడ్డి రఘురామ్ నాయుడు మాట్లాడుతూ... ముంపు కారణంగా నష్టపోయిన రైతులను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని డిమాండ్ చేశారు. పంట పొలాల్లో ఎంత మేరకు నష్టం జరిగిందో అధికారులు వెంటనే క్షేత్రస్థాయిలో అంచనా వేయాలని కోరారు.

రైతుల నుంచి ఫిర్యాదులు వచ్చిన తర్వాత స్పందించడం కాకుండా... ముంపు ప్రాంతాలను అధికారులు స్వయంగా పరిశీలించి పంట నష్టాన్ని నమోదు చేయాలని అన్నారు.

నష్టపోయిన రైతులకు తక్షణ ఆర్థిక సహాయం అందించాలని... పంట నష్టం పరిహారం విషయంలో ప్రభుత్వం ఆలస్యం చేయకూడదని డిమాండ్ చేశారు.

### ఒక్క పార్టీ ప్రభుత్వం ఇచ్చిన పరిహారం కంటే... మూడు పార్టీలు మూడు రెట్లు ఇవ్వాలి

గత వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ హయాంలో పంట నష్టం జరిగిన సమయంలోనే పరిహారం అందించే విధంగా చర్యలు తీసుకున్నామని వడ్డి రఘురామ్ నాయుడు పేర్కొన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో మూడు పార్టీలు కలిసి అధికారంలో ఉన్నాయని ప్రస్తావిస్తూ... గతంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఇచ్చిన నష్టపరిహారం కంటే ఇప్పుడు అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం మూడు రెట్లు పరిహారం చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు.

ముంపు కారణంగా తీవ్రంగా నష్టపోయిన రైతులకు కనీసం రూ.25 వేల నుంచి రూ.30 వేల వరకు తక్షణ సాయం అందించాలని కోరారు. రైతులు మళ్లీ తదుపరి పంట సాగు చేసుకునే పరిస్థితి కల్పించాలంటే ప్రభుత్వం వెంటనే ఆర్థిక సహాయం అందించాల్సిన అవసరం ఉందన్నారు.నందమూరు అక్విడెక్ట్ ప్రాంతంలో నీటి ప్రవాహానికి అడ్డంకిగా ఉన్న గుర్రపు డెక్కను తొలగించాల్సిన అవసరం ఉందని వడ్డి రఘురామ్ నాయుడు అన్నారు.

గుర్రపు డెక్కను ముందుగానే తొలగించి ఉంటే నీటి ప్రవాహానికి ఇబ్బంది ఏర్పడేది కాదని ఆయన అభిప్రాయపడ్డారు. వర్షాకాలం ప్రారంభానికి ముందే అక్విడెక్టులు, కాలువలు, డ్రెయిన్లు, నీటి ప్రవాహ మార్గాలను పరిశీలించి అడ్డంకులను తొలగించాల్సిన అవసరం ఉందన్నారు. వరదలు వచ్చిన తర్వాత హడావుడిగా చర్యలు చేపట్టడం కంటే... ముందస్తు ప్రణాళికతో అధికారులు పనిచేయాలని కోరారు.

### ప్రతి ఏడాది ముంపే... ముందస్తు చర్యలు ఏమిటి?

తాడేపల్లిగూడెం నియోజకవర్గంలోని ఈ ప్రాంతాలు ప్రతి ఏడాది వర్షాకాలంలో ముంపునకు గురవుతున్నాయని వడ్డి రఘురామ్ నాయుడు అన్నారు. ప్రతి సంవత్సరం ఇదే సమస్య పునరావృతమవుతున్నప్పుడు... ముంపును నివారించేందుకు ప్రభుత్వం ముందస్తుగా ఎలాంటి చర్యలు తీసుకుంటోందో చెప్పాలని ప్రశ్నించారు. కాలువల్లో పూడికతీత, గుర్రపు డెక్క తొలగింపు, నీటి ప్రవాహ మార్గాల శుభ్రత, అక్విడెక్టుల నిర్వహణ వంటి అంశాలపై అధికారులు ముందుగానే దృష్టి పెట్టాలని అన్నారు. ముంపు వచ్చిన తర్వాత ప్రాంతాలను సందర్శించడం కంటే... ముంపు రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవడమే ప్రభుత్వ బాధ్యత అని వ్యాఖ్యానించారు. ఇరిగేషన్, రెవెన్యూ శాఖలపై విమర్శలు ముంపు సమస్యపై ఇరిగేషన్, రెవెన్యూ శాఖలు తగిన స్థాయిలో స్పందించడం లేదని వడ్డి రఘురామ్ నాయుడు విమర్శించారు. రైతుల సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి... పంట నష్టాన్ని నమోదు చేసి, సంబంధిత అధికారులకు నివేదికలు పంపి, పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. రైతులు పంట నష్టంతో ఇబ్బందులు పడుతున్న సమయంలో శాఖల మధ్య సమన్వయం అవసరమని అన్నారు.

### యూరియా బ్లాక్ మార్కెట్‌పై ఆగ్రహం

ఇదే సమయంలో రైతులకు అవసరమైన యూరియా విషయంలో కూడా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని వడ్డి రఘురామ్ నాయుడు డిమాండ్ చేశారు. యూరియాను బ్లాక్‌లో విక్రయిస్తున్నారనే ఆరోపణలపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.

రైతులకు అవసరమైన సమయంలో ఎరువులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని... అక్రమ విక్రయాలకు పాల్పడుతున్న వారిపై అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. పంట నష్టంతో ఇబ్బందులు పడుతున్న రైతులకు మరోవైపు ఎరువుల సమస్య కూడా ఎదురైతే వారి పరిస్థితి మరింత దయనీయంగా మారుతుందని అన్నారు. ఫార్మాలిటీ కోసం వచ్చి ఫోటోలు తీసుకుని వెళ్లిపోవడం కాదు ముంపు ప్రాంతాలను సందర్శించడం కేవలం ఫార్మాలిటీగా మారకూడదని వడ్డి రఘురామ్ నాయుడు అన్నారు. ప్రాంతానికి వచ్చి రైతులతో మాట్లాడి, ఫోటోలు తీసుకుని వెళ్లిపోవడం కాకుండా... వారి సమస్యలకు పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు.



రైతుల పొలాల్లోకి నీరు ఎందుకు చేరుతోంది...? నీరు వేగంగా బయటకు వెళ్లేందుకు ఎలాంటి అడ్డంకులు ఉన్నాయి...? వాటిని శాశ్వతంగా ఎలా పరిష్కరించాలి...? అనే అంశాలపై అధికారులు సమగ్రంగా అధ్యయనం చేయాలని అన్నారు.

రూ.25 వేల నుంచి రూ.30 వేల తక్షణ సాయం ఇవ్వాలి

ముంపుతో నష్టపోయిన రైతులకు ప్రభుత్వం రూ.25 వేల నుంచి రూ.30 వేల వరకు తక్షణ సాయం అందించాలని వడ్డి రఘురామ్ నాయుడు డిమాండ్ చేశారు. పంట నష్టాన్ని అంచనా వేసే ప్రక్రియ పూర్తయ్యే వరకు రైతులు ఎదురుచూసే పరిస్థితి లేకుండా... అత్యవసర సాయంగా తక్షణ ఆర్థిక సహాయం అందించాలని కోరారు. అదేవిధంగా పూర్తి స్థాయి పంట నష్టాన్ని అంచనా వేసి... ప్రభుత్వ నిబంధనల ప్రకారం అదనపు పరిహారం అందించాలని డిమాండ్ చేశారు.

### రైతుల కోసం ఉద్యమాన్ని ఉధృతం చేస్తాం

రైతుల సమస్యలపై ప్రభుత్వం తక్షణమే స్పందించాలని వడ్డి రఘురామ్ నాయుడు కోరారు. ముంపు ప్రాంతాల్లోని రైతులకు న్యాయం చేయకపోతే... వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరఫున రైతుల కోసం ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు. రైతుల పంట నష్టం, ముంపు సమస్య, ఎరువుల సమస్య, నష్టపరిహారం వంటి అంశాలపై ప్రభుత్వం స్పష్టమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎర్రకాలువ ముంపు సమస్యకు తాత్కాలిక చర్యలతో కాకుండా... శాశ్వత పరిష్కారం చూపాలని అన్నారు. నందమూరు నుంచి మారంపల్లి, జగన్నాథపురం, దండగర్ర, మాధవరం వరకు ముంపు ప్రభావిత ప్రాంతాలను సమగ్రంగా పరిశీలించి... రైతులకు భరోసా కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు.

రైతుల పంటను కాపాడటంతో పాటు... నష్టపోయిన రైతులకు తక్షణ సాయం అందించి, భవిష్యత్తులో ముంపు పునరావృతం కాకుండా శాశ్వత చర్యలు చేపట్టాలని వడ్డి రఘురామ్ నాయుడు డిమాండ్ చేశారు. ఈ పర్యటనలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక రైతులు పాల్గొన్నారు.

# ఎన్నికల కమిషన్ జ్ఞానేశ్ కుమార్ ను తక్షణం తొలగించాలి.

* పి సి సి ఎస్సీ డిపార్ట్మెంట్ ప్రధాన కార్యదర్శి కొండ శ్రీను డిమాండ్.



**గోకవరం పెన్ పవర్ సెప్టెంబర్ 26 :-**జాతీయ ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ వెంటనే తొలగించాలి అని తొలగించడమే కాకుండా అరెస్ట్ చేసి విచారణ చేసి భారత రాజ్యాంగాన్ని ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ ఎస్సీ డిపార్ట్మెంట్ ప్రధాన కార్యదర్శి కాకినాడ జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు జగ్గంపేట నియోజకవర్గ కోఆర్డినేషన్ కమిటీ సభ్యులు కొండ శ్రీను డిమాండ్ చేశారు. దీనికి సంబంధించి గోకవరంలో ఆయన మీడియాకు ఒక ప్రకటన విడుదల చేస్తూ మాట్లాడారు.ఎన్నికల ప్రక్రియలో భాగంగా రాజ్యాంగంలో ఎన్నికల కమిషనర్ ని నిర్మించే బాధ్యత ఒక ప్రధానమంత్రి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి ప్రతిపక్ష నాయకుడు సమక్షంలో జరగాలని ఉన్న ఆ ప్రతిరేఖ తూట్లు పొడిచి బిజెపి ప్రభుత్వం రాజ్యాంగ సవరణ చేసి ఆ ప్రక్రియ నుంచి ప్రధాన న్యాయమూర్తులు తప్పిస్తూ సీనియర్ క్యాబినెట్ మంత్రిని నియమిస్తూ చట్టం చేసింది ఎందుకనగా ఈ బీజేపీ ప్రభుత్వం ఎన్నికైన కమిషనర్ అడ్డుపెట్టుకుని ఓట్ల దొంగతనం చేసి అక్రమంగా అధికారంలో ఉండాలని ఆలోచనతో ఇటువంటి రాజ్యాంగ ప్రజాస్వామ్య వ్యతిరేకంగా విధానాలు చేపట్టింది అంతేకాక ఎన్నికల కమిషనర్లుగా ముగ్గురు నియమించింది ఆ ముగ్గురిలో ఇద్దరు కమిషనర్లు చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేష్ కుమార్ తీసుకునే నిర్ణయాలు తప్పు అని పది రోజుల్లో 14 సార్లు లిఖిత పూర్వకంగా కంప్లైంట్ చేసిన పట్టించుకోకుండా ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటూ రాజ్యాంగానికి విరుద్ధంగా ఎస్ ఐ ఆర్ లు కొత్త నిబంధనలు తీసుకొచ్చి దేశంలో అర్హులైన వాటర్ ని కూడా తొలగించి బిజెపి అనుకూలంగా ఉన్న దొంగ ఓట్లు జాయిన్ చేసి ఓట్లు దొంగతనం పాల్పడిందని కేంద్ర ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ గారు ఎన్నోసార్లు ముందుగానే హెచ్చరించారు కానీ ఆయన మాటలు పట్టించు కోకుండా ఈ ఓట్ల దొంగలు చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేష్ కుమార్ నియస్తామని తెలిసి ముందుగానే రాజ్యాంగ సవరణలో చీఫ్ ఎలక్షన్ కమిషనర్ పై రిటైర్డ్ అయిన తర్వాత కూడా ఇటువంటి కేసులు పెట్టడానికి లేదు విచారించటానికి లేదని ఒక చట్టాన్ని తీసుకొచ్చి ఆ తరువాత జ్ఞానేష్ కుమార్ ని చీఫ్ ఎలక్షన్ కమిషనర్ గా నియమించారని తద్వారా అనేక రాష్ట్రాల్లో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసి దొంగ ఓట్లు అధికరణకు వచ్చిన బిజెపి ప్రభుత్వం ఇప్పటికైనా బుద్ధి తెలుసుకుని జ్ఞానేష్ కుమార్ ని వెంటనే తొలగించి అతని విచారించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని లేదా అత్యున్నని స్థానం సుప్రీం కోర్ట్ ఈ ప్రభుత్వంపై ఎన్నికల కమిషనర్ పై రాజ్యాంగ ధర్మాసనం విచారణ చేపట్టాలని జ్ఞానేశ్ కుమార్ ని వెంటనే తొలగించాలని ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ ఎస్సీ విభాగం తరఫున ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ ఎస్సీ విభాగ ప్రధాన కార్యదర్శి కాకినాడ జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు కొండ శ్రీను డిమాండ్ చేశారు.

## క్రమశిక్షణ, పట్టుదలతో విజయాలు సాధించాలి

* విద్యార్థులకు చేబ్రోలు విశాల సహకార పరపతి సంఘ అధ్యక్షుడు కడియాల రవిశంకర్ పిలుపు



**పెన్ పవర్, ఉంగుటూరు, సెప్టెంబర్ 26:**విద్యార్థులు క్రమశిక్షణ, పట్టుదలతో విద్యనభ్యసించి జీవితంలో ఉన్నత విజయాలు సాధించాలని చేబ్రోలు విశాల సహకార పరపతి సంఘ అధ్యక్షుడు కడియాల రవిశంకర్ పిలుపునిచ్చారు. కాగుపాడు ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు వెలిచర్ల శ్రీనివాస్ అధ్యక్షతన పెట్ల పార్వతీ స్మారక సేవా సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.

ఈ సందర్భంగా ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు సుమారు రూ.10 వేల నగదు బహుమతులతో పాటు జ్ఞాపికలను అందజేశారు. అనంతరం విద్యా రంగంలో పెట్ల పార్వతీ స్మారక సేవా సంస్థ అందిస్తున్న సేవలను కొనియాడారు.

మండల విద్యాశాఖాధికారి సాయిబాబు మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాల నిర్వహణతో విద్యార్థుల్లో పోటీతత్వం పెంపొందుతుందని అన్నారు. విద్యా కార్యక్రమాలకు సంస్థ అందిస్తున్న సేవలు ఆదర్శప్రాయమని పేర్కొన్నారు.

పత్తి వీరస్వామి 'విద్యార్థులు--మానవ సంబంధాలు--నైతిక విలువలు' అనే అంశంపై మాట్లాడారు. ప్రతి విద్యార్థి శాస్త్రీయ అవగాహనతో పాటు మానవ సంబంధాలను, నైతిక విలువలను పెంపొందించుకోవాలని సూచించారు.

సంస్థ అధ్యక్షుడు పెట్ల కామేశ్వరరావు మాట్లాడుతూ ప్రశ్నించడం అభివృద్ధికి మూలమని అన్నారు. ప్రతి విద్యార్థి విషయాలను తెలుసుకోవాలనే ఆసక్తితో ప్రశ్నించడం అలవర్చుకోవాలని సూచించారు.

కార్యక్రమంలో గుదే శ్రీనివాసరావు, శీతల సత్యనారాయణ, ఆనంద్‌కుమార్, శ్రీవల్లి తదితరులు, వివిధ పాఠశాలల విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## నేడు జిల్లా స్థాయి చెకుముకి సైన్స్ సంబరాలు




**గంగవరం, పెన్ పవర్, సెప్టెంబర్ 26:**జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జిల్లా స్థాయి చెకుముకి సైన్స్ సంబరాలు--2026 ఆదివారం మారేడుమిల్లిలో జరగనున్నాయి. ఉదయం 9 గంటలకు మారేడుమిల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు జన విజ్ఞాన వేదిక పోలవరం జిల్లా అధ్యక్షులు తీగల బొజ్జయ్య, ప్రధాన కార్యదర్శి పాయం కన్నారావు తెలిపారు. పోలవరం జిల్లాలోని 11 మండలాల్లో ఇటీవల నిర్వహించిన మండల స్థాయి చెకుముకి సైన్స్ సంబరాల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులు జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొననున్నారు. జిల్లా స్థాయిలో సైన్స్ టెస్ట్ నిర్వహించడంతో పాటు విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం, పరిశీలన, విశ్లేషణా సామర్థ్యాలను పెంపొందించే విధంగా కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు.మండల స్థాయి విజేతలైన విద్యార్థులతో పాటు సంబంధిత సైన్స్ ఉపాధ్యాయులు తప్పనిసరిగా ఆదివారం ఉదయం 9 గంటలకు మారేడుమిల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు హాజరు కావాలని కోరారు.కార్యక్రమానికి ఏపీ యూటీఎఫ్ పోలవరం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, జిల్లా కార్యదర్శులు, 11 మండలాల యూటీఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, రాష్ట్ర కౌన్సిలర్లు, జన విజ్ఞాన వేదిక పోలవరం జిల్లా కార్యవర్గ సభ్యులు, 11 మండలాల జన విజ్ఞాన వేదిక అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, మండల కార్యవర్గ సభ్యులు ప్రత్యేక ఆహ్వానితులుగా హాజరుకానున్నారు.జిల్లా స్థాయి చెకుముకి సైన్స్ సంబరాలను విజయవంతం చేసేందుకు విద్యార్థులు, ఉపాధ్యాయులు, ప్రజా విజ్ఞాన ఉద్యమ కార్యకర్తలు సహకరించాలని జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు విజ్ఞప్తి చేశారు.

## విద్యుత్ శాఖపై మండల ప్రజలు ప్రశంసలు....



**అడ్డతీగల, పెన్ పవర్, సెప్టెంబర్ 26:** ఆర్నబ్ తుఫాను ప్రభావంతో అడ్డతీగల మండలంలో గత కొన్ని రోజులుగా భారీ వర్షాలు కురిసినప్పటికీ, విద్యుత్ శాఖ అధికారులు మరియు సిబ్బంది అప్రమత్తంగా పనిచేసి మండల ప్రజలకు నిరంతర విద్యుత్ సరఫరా అందించారు.

గతంలో వచ్చిన తుఫాన్ల సమయంలో విద్యుత్ సరఫరాలో ఏర్పడిన అంతరాయాలను సరిచేయడానికి అనేక రోజులు పట్టేది. అయితే ప్రస్తుతం విద్యుత్ శాఖ సిబ్బంది ఆధునిక పరికరాలు, సమన్వయంతో కూడిన చర్యలు మరియు వేగవంతమైన స్పందనతో కొన్ని గంటల్లోనే విద్యుత్ సరఫరాను పునరుద్ధరిస్తున్నారు. భారీ వర్షాల కారణంగా కొన్ని ప్రాంతాల్లో విద్యుత్ లైన్లు, విద్యుత్ స్తంభాలు మరియు ఇతర పరికరాలకు అంతరాయాలు ఏర్పడిన సందర్భాల్లో విద్యుత్ శాఖ సిబ్బంది వెంటనే స్పందించి అత్యంత వేగంగా మరమ్మత్తు పనులు చేపట్టి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. మండలంలో మారుమూల ప్రాంతాల్లో కూడా విద్యుత్ సమస్య లేకుండా నిరంతరం విద్యుత్ అందించారు అని మారుమూల ప్రాంతవాసులు ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు. అడ్డతీగల విద్యుత్ విభాగం సిబ్బంది 24 గంటల పాటు క్షేత్ర స్థాయిలో విధులు నిర్వహిస్తూ, ఎటువంటి పెద్ద అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా కొనసాగించేలా ఏ ఈ సుదర్శన్ పర్యవేక్షణ చర్యలు చేపట్టారు. మండల వ్యాప్తంగా విద్యుత్ సరఫరా నిర్వహణలో విద్యుత్ శాఖ సిబ్బంది చూపిన అంకితభావం, వేగవంతమైన స్పందనపై వినియోగదారులు ప్రశంసలు వ్యక్తం చేశారు. ప్రజలకు నాణ్యమైన మరియు నిరంతర విద్యుత్ సేవలు అందించడమే తమ లక్ష్యమని విద్యుత్ శాఖ అధికారులు తెలిపారు. వర్షాకాలంలో విద్యుత్ భద్రతా నియమాలను పాటించాలని, విద్యుత్ తీగలు తెగి పడినట్లు గమనిస్తే వెంటనే విద్యుత్ శాఖకు సమాచారం అందించాలని విద్యుత్ శాఖ రంపచోడవరం ఈ ఈ పి. అచ్యుతాచారి, ఏ డి ఈ గోపాలకృష్ణ, అడ్డతీగల ఏ. ఈ సుదర్శన్ ప్రజలను కోరారు.

On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh. Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh.
Editor: G.APPARAO, Mobile : 9059465965, RNI : APTEL/2014/58046, e-mail:penpower9@gmail.com